ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 15 ఏప్రిల్ 2025


ప్రజా వేదికకు హాజరైన జనం

ప్రతిభ.. విదేశీ విద్యానిధి

- అంబేడ్కర్ విదేశీ విద్యానిధి ప్రారంభిస్తాం
- ఎస్సీ విద్యార్థులకు అత్యున్నత విద్యనందించడమే లక్ష్యం
- త్వరలో మరిన్ని రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు
- రాష్ట్రాన్ని, అమరావతిని పునర్నిర్మిస్తున్నాం
- దళితుల కోసం యుద్ధం చేసిన యోధుడు అంబేడ్కర్
- ఆయన స్ఫూర్తితో పీ- 4 పథకం రూపకల్పన
- అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- పొన్నెకల్లులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

'దళితుల కోసం యుద్ధం చేసిన యోధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆ మహనీయుని స్ఫూర్తితో దళితుల అభ్యున్నతి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.' అని సీఎం చంద్రబాబు నాయుడు ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతిపై తమకున్న చిత్త శుద్ధిని మరో మారు విస్పష్టం చేశారు. గత పాలకులు కక్షపూరితంగా అమరావతిని నాశనం చేస్తే, ప్రజల ఆశీస్సులతో ప్రపంచంలోనే మేటి నగరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ప్రతి దళిత బిడ్డకు అత్యున్నత విద్యను అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మళ్లీ అంబేడ్కర్ విదేశీ విద్యా నిధి పథకాన్ని ప్రారంభిస్తామని, దళిత కుటుంబాలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందజేస్తామని సీఎం వరాల జల్లు కురిపించారు.

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా తాడికొండ నియోజకవర్గం పొన్నెకల్లులో సోమవారం నిర్వహించిన వేడుకల్లో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రూ. 102 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడారు. భారత ప్రజాస్వామ్య దశ, దిశ మార్చిన ఘనత అంబేడ్కర్‌దేనన్నారు. భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించడంతో పాటు, సామాజిక న్యాయం, మౌలిక హక్కులు, సమానత్వం గురించి అందులో పొందు పరిచారని వివరించారు. రాజ్యాంగం ఒక పేపరో, పుస్తకమో కాదని, పవిత్రమైన గ్రంథమని సీఎం పేర్కొన్నారు. అంబేడ్కర్ ఏ ఒక్కరికో, వర్గానికో ప్రతినిధి కాదని, అందరివాడని కొనియాడారు.


స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ..

● పేదలపై వైసీపీ కపట ప్రేమ!

ఆవిర్భావం నుంచి దళితుల సంక్షేమానికి తెలుగుదేశం పెద్దపీట వేస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. 2002లో ముందడుగు కార్యక్రమం ద్వారా స్టడీ సెంటర్లు పెట్టి ఎస్సీ, ఎస్టీ పిల్లలను చదవించామన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం ద్వారా పేద విద్యార్థులను చదివిస్తామని, ఈ పథకాన్ని మరింత మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు. గతంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 15 లక్షలు, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ విద్యార్థులకు రూ. 10 లక్షలు ఆర్థిక సాయం చేశామని సీఎం గుర్తుచేశారు. 2014-19 మధ్య సుమారు 7 వేల మందిని చదివించేందుకు రూ.467 కోట్లు వెచ్చించామని తెలిపారు. అదే కాలంలో 619 మంది ఎస్సీ, 55 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.50 కోట్లు వ్యయం చేయగా.. గత ప్రభుత్వం కేవలం 430 మందినే చదివించిందని దుయ్యబట్టారు. దీనిని బట్టి పేదలపై వారికి ఏమాత్రం ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. సబ్ ప్లాన్ తెచ్చామని, ఎస్సీ రైతుల కోసం రూ.1,300 కోట్లు, హార్టికల్చర్ రంగంలోని ఎస్సీల కోసం రూ. 130 కోట్లు, ఇళ్ల నిర్మాణానికి రూ. 1,253 కోట్లు, గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.1,200 కోట్లు, జలజీవన్ మిషన్ కింద రూ. 478 కోట్లు ఖర్చు చేస్తానని సీఎం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,241 ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో 2,35,600 మంది విద్యార్థులకు రూ.1,331 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

● దళిత కుటుంబాలకు సంక్షేమం..

రాష్ట్రంలో 21 లక్షల పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉన్నాయని, వారి కోసం 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని సీఎం తెలిపారు. ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని, 200 యూనిట్లు వాడుకుని మిగిలింది ప్రభుత్వానికి ఇస్తే యూనిట్‌కు 2.09 పైసలు ఇస్తామని ప్రకటించారు. దానివల్ల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఇల్లు కట్టుకునేందుకు రూ.50 వేలు అదనంగా ఇస్తామని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రూ. 780 కోట్లు ఇందుకు ఖర్చవుతుందని తెలిపారు. ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా సురక్షితమైన నీరు, అర్హులకు ఉచిత విద్యుత్, ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు, ఇంటర్నెట్, మరుగుదొడ్ల నిర్మాణం, సొంతింటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రముఖ వ్యక్తి.. గొప్ప వ్యక్తి కావాలి

ఏ సమాజం పురోగతి అయినా అందులోని బలహీన వర్గాల అభ్యున్నతిపై ఆధారపడుతుందని అంబేడ్కర్ వ్యాఖ్యలను సభలో సీఎం చంద్రబాబు ఉటంకించారు. ఒక ప్రముఖ వ్యక్తికి, గొప్ప వ్యక్తికి వ్యత్యాసం.. గొప్ప వ్యక్తి సమాజ సేవకుడిగా ఉండేందుకు సిద్ధపడతాడని ఆయన వివరించారు. 'గొప్ప వ్యక్తి కావాలంటే పేదలకు అండగా నిలబడి, వారిని పైకి తేవాలి. అప్పుడు మీరు గొప్ప వ్యక్తులవుతారు. నేను ఇచ్చిన మాట ప్రకారం పేదలకు అండగా నిలబడతాను. పేదలే దేవుళ్లు సమాజమే దేవాలయం అని చెప్పిన ఎన్టీఆర్ స్ఫూర్తితో ముందు కెళ్తున్నాం.' అని సీఎం పునరుద్ఘాటించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు మంచి స్థానాల్లో ఉన్నారని, 2047 నాటికి దేశంలోనే నంబరు వన్ స్టేట్‌గా ఏపీ నిలుస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. దీపం-2 పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఓ వైపు సంక్షేమం - అభివృద్ధి, మరోవైపు సుపరి పాలన ఇదే ఎన్డీఏ ప్రభుత్వ విధానమని చంద్రబాబు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, కోవెలమూడి రవీంద్ర, మద్దిరాల మ్యాని తదితరులు పాల్గొన్నారు.


ఇంటిని పరిశీలిస్తూ..


పొన్నెకల్లులో చెక్క సెంట్రింగ్ పని చేసే నవీన్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు


బడ్డీకొట్టు నిర్వాహకురాలు బుర్రా చిన్నమ్మాయితో మాట్లాడుతున్న చంద్రబాబు


బైక్ మెకానిక్ ప్రవీణ్ వద్ద పరికరాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు


చిన్నారికి తినిపిస్తూ..

సర్వే.. సరిగా చేయండి

- వర్క్ ఫ్రం హోం సర్వేలో కొరవడిన చొరవ
- గుంటూరులో ముందుకు కదలని వైనం
- సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలని
- జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం ఆదేశం
- పల్నాడులో కాస్తంత మెరుగు



గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోం(డబ్ల్యూఎఫ్‌హెచ్) సర్వేలో గుంటూరు జిల్లా వెనకబడింది. రాష్ట్రంలో ఎక్కువ పెండింగ్ ఉన్న ఆరు జిల్లాల్లో ఒకటిగా ఉండటంతో ఈ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించి సాధ్యమైనంత త్వరగా సర్వే పూర్తి చేయించాలని సూచించింది. 18 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతీ ఒక్కరిని సర్వే చేయాల్సిందేనని, ప్రస్తుతం చేస్తున్న పని, వర్క్ ప్రొఫైల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి అన్ని వివరాలు సేకరించాలని స్పష్టం చేసింది. పట్టణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న గుంటూరు జిల్లాలోనే ఎక్కువమంది వర్క్ ఫ్రం హోం విధానంలో ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడుతున్నారు. అలాంటిది ఇక్కడే సర్వే సక్రమంగా జరగని పరిస్థితి నెలకొన్నది.

రాష్ట్ర ప్రభుత్వం మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని నిరుద్యోగులకు ఇంటి నుంచే పని చేసే ఉద్యోగాలు కల్పించేందుకు నిర్ణయించింది. ఇందు కోసం వర్క్ ఫ్రం హోం వాతావరణం పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. భవనాలు నిర్మించి హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాన్ని కూడా కల్పించి అక్కడ సిస్టమ్స్ ఏర్పాటు చేయడం వంటివి చేపట్టబోతున్నది. ఈ నేపథ్యంలో ఇంటి వద్దనే ఉంటూ పని చేసేందుకు ఆసక్తి కలిగిన వారి వివరాలను సేకరించాలని గత నెలలో నిర్ణయించింది. ఆ మేరకు ఒక యాప్‌ని రూపొందించి సర్వే చేపట్టాల్సిందిగా ఆదేశించింది. గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు ప్రారంభంలో ఈ సర్వేపై చొరవ చూపించారు. ఇప్పుడు పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో గుంటూరు జిల్లాలో సర్వే చేయాల్సిన కుటుంబ సభ్యుల సంఖ్య లక్షల్లోనే ఉన్నది.

● గుంటూరు జిల్లాలో మొత్తం 5 లక్షల 13 వేల 193 కుటుంబాలు ఉండగా 11 లక్షల 25 వేల 89 మంది సభ్యులున్నారు. ఇప్పటివరకు 6 లక్షల 20 వేల 105 మంది సర్వేని పూర్తి చేయగా ఇంకా 5 లక్షల 4 వేల 984 మందిని సర్వే చేయాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సర్వే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ● పల్నాడు జిల్లాలో 4 లక్షల 99 వేల 538 కుటుంబాలకు 11 లక్షల 22 వేల 857 మంది సభ్యులున్నారు. వారిలో 6 లక్షల 88 వేల 558 మంది సర్వే పూర్తి అయిపోయింది. ఇంకా 4 లక్షల 34 వేల 299 మంది సర్వే పెండింగ్‌లో ఉన్నది. ● బాపట్ల జిల్లాలో 3 లక్షల 61 వేల 397 కుటుంబాలుండగా 7 లక్షల 97 వేల 448 మంది సభ్యులున్నారు. వీళ్లల్లో 6 లక్షల 23 వేల 94 మంది సర్వే పూర్తి అయినట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఇంకా కేవలం లక్షా 74 వేల 354 మందిని సర్వే చేస్తే ఈ జిల్లాలో పూర్తి అవుతుంది.

సర్వే పూర్తయితేనే స్పష్టత

మూడు జిల్లాల్లో వర్క్ ఫ్రం హోం సర్వే 100 శాతం పూర్తి అయితేనే ఎంతమంది నిరుద్యోగులు ఇంటి వద్దనే ఉండి పని చేయాలని కోరుకుంటున్నారనే దానిపై స్పష్టత వస్తుంది. అలానే ఎవరెవరు ఎలాంటి పనులు చేయాలని ఆసక్తి చూపిస్తున్నారో తెలుస్తుంది. ఆ మేరకు వాళ్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగం చేయడానికి సిద్ధం చేయవచ్చు. అలానే ఉద్యోగాల విభజన ప్రక్రియ సులభతరం అవుతుంది.

కల సాకారానికి.. కదలిక

- తీరనున్న నందివెలుగు ఆర్వోబీ సమస్య
- టెండర్ ప్రక్రియని ప్రారంభించిన రైల్వే శాఖ
- రూ. 17.69 కోట్ల అంచనాలతో నిర్మాణ పనులు
- 12 నెలల్లో పెండింగ్ పనుల పూర్తికి లక్ష్యం
- కేంద్ర మంత్రి పెమ్మసాని చొరవతో ఎట్టకేలకు మోక్షం


నిలిచిన ఆర్వోబీ పనులు

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నందివెలుగు రహదారిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రైల్వే శాఖ టెండర్ ప్రక్రియను ప్రారంభించింది. ఆ మేరకు రైల్వే కన్‌స్ట్రక్షన్ విభాగం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం రూ.17,69,21,456తో అంచనాలు రూపొందించింది. ఈ నెలలో టెండర్‌ని ఖరారు చేసి, 90 రోజుల్లో ఒప్పందం చేసుకొని, 12 నెలల వ్యవధిలో పనులు పూర్తి చేసి ఆర్వోబీని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పనిని రోడ్లు, భవనాల శాఖ చేపట్టాల్సి ఉండగా ఆ శాఖ నిధుల కొరతతో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉంచింది. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ విషయాన్ని జాతీయ రహదారులు, రైల్వే మంత్రిత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి భారం లేకుండా తామే ఆ పనిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చాయి.

నిధుల కొరతతో ఆగిన పనులు

గుంటూరు - వేజండ్ల సెక్షన్‌లోని నందివెలుగు రోడ్డులో లెవల్ క్రాసింగ్ గేటు ఉంది. గుంటూరు - తెనాలి రైలు మార్గం డబ్లింగ్ కావడంతో ఇటీవల రైళ్ల రద్దీ పెరిగింది. దీనిని ముందుగానే అంచనా వేసిన రైల్వే శాఖ నందివెలుగు రోడ్డు ఎల్‌సీ గేటుని తొలగించి, దాని స్థానంలో ఆర్వోబీని నిర్మించేందుకు ఏడెనిమిది ఏళ్ల క్రితమే నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ పనిని చేపట్టింది. రైల్వే భాగం వరకు ఆర్వోబీ నిర్మాణం పూర్తయింది. దీనికి ఇరువైపులా రోడ్లు, భవనాల శాఖ వంతెనలు నిర్మించాల్సి ఉండగా.. కొంత మేరకు పనులు చేసి నిధుల కొరతతో పక్కన పెట్టేసింది. బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక పోవడంతో రైల్వే శాఖ ఎల్‌సీ గేటులో వాహనాల రాకపోకలను కొనసాగిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో పనుల పురోగతికి ఎలాంటి అడుగు పడలేదు.

పెమ్మసాని చొరవ

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు నందివెలుగు ఆర్వోబీ సమస్యను స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తాను గెలిచాక తప్పక పెండింగ్ పనులు పూర్తి చేయిస్తానని పెమ్మసాని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి భారం పడకుండా నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణంలో సూపర్ స్ట్రక్చర్, 16 ఆర్‌సీసీ బ్లాకులు నిర్మించాల్సి ఉంది. ఇంకా మరికొన్ని పనులు ఉండగా వాటన్నింటిని కొద్ది రోజుల్లోనే చేపట్టి.. వచ్చే ఏడాది కల్లా ఆర్వోబీని పూర్తిగా అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో గుంటూరు - హనుమాన్‌పాలెం రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు వంద శాతం తీరుతాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

● రైల్వే భాగం వరకు నిర్మాణం పూర్తైన బ్రిడ్జి



మస్తాన్ దర్గా స్వాధీనానికి వక్ఫ్‌బోర్డు యత్నం

● మంగళవారం వస్తామని ట్రస్టీలకు సమాచారం

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరంపాలెంలోని హజరత్ కాలే మస్తాన్ షా వలియా బాబా దర్గాని స్వాధీనం చేసుకొనేందుకు వక్ఫ్‌బోర్డు ప్రయత్నిస్తోంది. వక్ఫ్ బోర్డు సీఈవో నుంచి అందిన ఆదేశాల మేరకు జిల్లా వక్ఫ్ అధికారులు, పోలీసులు సోమవారం సాయంత్రం మస్తాన్ దర్గాకు వెళ్లి అక్కడ ట్రస్టీలకు సమాచారం ఇచ్చారు. దర్గా ధర్మకర్తగా చెప్పుకొంటున్న రావి రామ్మోహన్‌రావు, ఆయన కుమారుడు మస్తాన్ సాయి దర్గాని వ్యాపార కేంద్రంగా మార్చారని ముస్లిం సేన రాష్ట్ర నేతలు షేక్ సుభాని, నాగూల్ మీరాలు ఆరోపించారు. మస్తాన్ సాయి అయితే డ్రగ్స్, అమ్మాయిలను వేధించిన కేసుల్లో నిందితుడిగా తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేశారు. మరోవైపు దర్గాకు వచ్చే ఆదాయంలో ఏడు శాతం వక్ఫ్‌బోర్డుకు చెల్లించాల్సి ఉండగా కొన్నేళ్ల నుంచి రావి రామ్మోహన్‌రావు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వీటన్నింటిపై వక్ఫ్‌బోర్డు స్పందించి తాత్కాలికంగా ధర్మకర్తని తొలగించి దర్గాని తన ఆధీనంలోకి తీసుకునేందుకు నిర్ణయించింది. ఆ మేరకు మంగళవారం వక్ఫ్ అధికారులు మస్తాన్‌దర్గాకు రానున్నారు.




8

ఎట్టకేలకు ఐపీఎల్ బరిలో రషీద్

- తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున అరంగేట్రం
- ఓపెనర్‌గా అవకాశం కల్పించిన జట్టు యాజమాన్యం

మోదుగుల పాపిరెడ్డికి ప్రముఖుల ఘన నివాళి

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సోషలిస్టు నాయకుడు, న్యాయవాది మోదుగుల పాపిరెడ్డికి పలువురు ప్రముఖులు ఘన నివాళులర్పించారు. పాపిరెడ్డి పెద్ద కర్మ కార్యక్రమం ఆయన తనయుడు, మాజీ ఎంపీ



పాపిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, మాజీ మంత్రి అంబటి, కరణం బలరాం తదితరులు

మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం రెడ్డిపాలెంలోని శ్రీరామధామంలో జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎంపీ కరణం బలరాం, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, టీడీపీ నేత కోవెలమూడి రవీంద్ర (నాని), భాష్యం రామకృష్ణ పలువురు ప్రముఖులు పూలమాలలతో పాపిరెడ్డికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోషలిస్టు ఉద్యమకారుడిగా పాపిరెడ్డి సేవలను కొనియాడారు.

అమర్నాథ్ యాత్రీకులకు గుంటూరులో వైద్య పరీక్షలు

- ప్రతి బుధ, శుక్రవారాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- రూ. 1500 చెల్లింపుతో మెడికల్ సర్టిఫికెట్
- ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణ ఎస్‌ఎస్‌వీ

గుంటూరు సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అమర్నాథ్ యాత్రకు వెళ్ళేవారికి గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహెచ్)లో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణ ఎస్‌ఎస్‌వీ సోమవారం వెల్లడించారు. ప్రతి బుధ, శుక్రవారాలలో ఈ ప్రత్యేక వైద్య పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి యాత్రీకులకు వైద్య పరీక్షలు నిర్వహించి మెడికల్ సర్టిఫికెట్‌లు జారీచేస్తామని తెలిపారు. ఈ యాత్రకు వయస్సు 13 నుంచి 75 సంవత్సరాల మధ్య ఉన్న వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లా వారైనా ఇక్కడ పరీక్షలకు హాజరవ్వవచ్చన్నారు. వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే వారు రెండు పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, వయస్సు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు, అమర్నాథ్ యాత్ర- 2025వ సంవత్సరానికి సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్ నమూనా రెండు కాపీలు తీసుకుని రావాలని తెలిపారు. మెడికల్ సర్టిఫికెట్ కోసం వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయంలోని వైద్యశాల అభివృద్ధి సంఘం కౌంటర్‌లో రూ.1500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆరు వారాలు నిండిన గర్భిణులకు ఈ యాత్రకు అర్హత లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

కూతురుపై తండ్రి అత్యాచారం

- తల్లి చూసి కేకలు వేయడంతో పరారు ● ఫోక్సో చట్టంపై కేసు నమోదు

తెనాలిరూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కంటికిరెప్పలా కాపాడాల్సిన తండ్రే కన్నకూతురిపై అత్యాచారం చేసిన ఘటన మండలంలోని గుడివాడలో వెలుగుచూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం గుడివాడకు చెందిన 40 సంవత్సరాల వ్యక్తికి 15ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఆదివారం తెల్లవారుజామున భర్త కూతురిపై లైంగిక దాడికి పాల్పడటం గమనించిన తల్లి ఒక్కసారిగా కేకలు వేయటంతో తండ్రి అక్కడి నుంచి పారిపోయాడు. భార్య ఫిర్యాదుమేరకు భర్తపై పోక్సో, బీఎన్‌ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ పేర్కొన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

◆ కాకతీయ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య టీ రమేష్ ◆ ఏఎన్‌యూలో ఘనంగా జయంతి వేడుకలు

పెదకాకాని, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మేధావుల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒకరుగా నిలుస్తారని వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య టీ రమేష్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సోమవారం అట్టహాసంగా జరిగింది. ముందుగా వర్సిటీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధర్ రావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య అశోక్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే అబ్రహం లింకన్, ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆచార్య టీ రమేష్, హైకోర్టు న్యాయవాది డాక్టర్ మద్దు అంకయ్య, విద్యార్థి సంఘం నాయకులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలుస్తారన్నారు. 134 ఏళ్ల తర్వాత కూడా ఆయన జన్మదినాన్ని జరుపుకుంటున్నామంటే ఆయన చేసిన సేవలు అజరామరంగా నిలుస్తాయన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆర్థిక విధానాలకు అంబేడ్కర్ వంటి మేధావి ఉన్నట్లయితే వాటికి పరిష్కారం చూపగలిగేవారని పేర్కొన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగం ఇతర రాజ్యాంగాల కంటే గొప్పదిగా అభివర్ణించారు. రాజ్యాంగంలోని ప్రతి ఒక్క అంశాన్ని నేటి యువత తెలుసుకోవాలని సూచించారు. ఈ వేడుకల్లో బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య మల్లికార్జున, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, పీజీ ప్రవేశాల డైరెక్టర్ ఆచార్య బ్రహ్మజీరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కంకణాల సుబ్బారావు, పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు, పరీక్షల నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాష్ రావులు అంబేడ్కర్ గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వికాస అధ్యక్ష కార్యదర్శులు ఎన్. ప్రసాద్, జే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు దాసరి విజయ ప్రకాష్, దినసరి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రత్తయ్య, ఎన్‌డీఎస్‌ఎఫ్, ఎంఎస్‌ఎఫ్, బీసీఎస్‌ఎఫ్, ఏబీవీపీ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాలతో పాటు అతిథి ఆధ్యాపకుల సంఘం నాయకులు ఈ వేడుకల్లో పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపండి

గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపాలని గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం గుంటూరు ఎక్సైజ్ కార్యాలయంలో గుంటూరు, పల్నాడు జిల్లాల ఎక్సైజ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో, గ్రామాలలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవోదయం 2.0 విజయవంతంగా అమలు చేయాలన్నారు. పల్నాడు జిల్లాలో 28 గ్రామాలను నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుటకు తీసుకోవలసిన చర్యల గురించి దిశా నిర్దేశం చేశారు. ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు, గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా ఆయా గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడ కూడా అనధికారిక మద్యం అమ్మకాలు జరక్కుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మద్యం దుకాణాన్ని, బార్, కల్లు దుకాణాల వద్ద శాంపిల్స్ కలెక్ట్ చేయాలని, కల్తీ జరగకుండా అధికారులు తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఎమ్మార్పీకే మద్యం అమ్మేలాగా చూడాలన్నారు. సమావేశంలో ఎస్‌టీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం సుధాకర్ రెడ్డి(మంగళగిరి), అసిస్టెంట్ కమిషనర్ ఎం రవి కుమార్ రెడ్డి, గుంటూరు ఏఈ ఎస్ మారయ్య బాబు, పల్నాడు కే రవీంద్ర, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎక్సైజ్ శాఖ సీఐలు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

అంతర్ జిల్లాల దొంగ అరెస్టు

రెంటచింతల,ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీలోని పలు జిల్లాల్లో దొంగతనాలు చేసి గృహ యజమానులను భయభ్రాంతులకు గురిచేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. గురజాల మండలం చర్లగుడిపాడుకు చెందిన అచ్చి చినసైదారావు అన్నమయ్య జిల్లా రాజంపేటలోను పల్నాడు జిల్లా రెంటచింతల ఆదూరి ఇన్నారెడ్డి గృహంలో ఫిబ్రవరి 18న దొంగతనం చేసి నగదును వస్తువులను అపహరించాడన్నారు. నిందితుడ్ని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరపర్చనున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. నిందితుడికి ఎంతో నేర చరిత్ర ఉందన్నారు. పగలు ఆటో నడుపుకుంటూ వీధుల్లో తిరగడం తాళాలు వేసిన గృహాల్లో రాత్రి చోరీకి పాల్పడడం నిందితుడి నైజమన్నారు.

నేడు విధులకు హాజరు కానున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో 10 రోజుల పాటు సెలవుపై విదేశాలకు వెళ్లిన జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సోమవారం గుంటూరు నగరానికి చేరుకొన్నారు. ఆమె మంగళవారం ఉదయం నుంచి యథాతథంగా కలెక్టరేట్‌లో విధులకు హాజరౌతారని కలెక్టరేట్ అధికారవర్గాలు తెలిపాయి. కలెక్టర్ నాగలక్ష్మి సెలవులోకి వెళ్లినప్పటి నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవతేజ అదనపు బాధ్యతల నుంచి రిలీవింగ్ అయ్యారు.

మార్కులు తక్కువ వచ్చాయని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

విజయవాడ (ఆటోనగర్), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫస్టియర్‌లో తక్కువ మార్కులు వచ్చాయనే మనస్థాపంతో ఓ విద్యార్థి ఉరేసుకుని మృతిచెందిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిడమానూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చీరాల మండలం తులసీనగర్‌కు చెందిన మంచాల కృషల్‌రెడ్డి (17) శాంతభవనం శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయని తండ్రికి ఫోన్ చేసి తెలిపాడు. ఆదివారం రాత్రి తండ్రికి ఫోన్ చేశాడు. బెటర్‌మెంట్ కట్టి మంచి మార్కులు తెచ్చుకుంటానని వివరించాడు. సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫోన్ చేసి కృషల్‌రెడ్డి ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయినట్లు తెలిపారు. తండ్రి వీరా వర్మరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

యడ్లపాడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : పదహారో నంబరు జాతీయరహదారిపై యడ్లపాడు ఎన్‌ఎస్‌ఎల్ టెక్స్‌టైల్స్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట పట్టణ పరిధిలోని పోలిరెడ్డిపాలెంకు చెందిన మక్కెన శివరామకృష్ణ(28) ఆదివారం ఉదయం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంపై విజయవాడకు వెళ్ళాడు. పనులు ముగించుకుని తిరిగి గ్రామానికి వస్తుండగా మార్గం మధ్యలో యడ్లపాడు ఎన్‌ఎస్‌ఎల్ టెక్స్‌టైల్స్ సమీపంలోకి రాగానే ముందువెళుతున్న కారు డ్రైవర్ సడన్‌గా బ్రేకులు వేయడంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో శివరామకృష్ణ తీవ్రంగా గాయపడగా స్థానికులు 108కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక పరీక్షల అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యంకోసం మంగళగిరిలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శివరామకృష్ణ సోమవారం ఉదయం మృతిచెందాడు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో పాటు సడన్ బ్రేక్‌లు వేయడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు.

యువతను ఆకట్టుకునే నాటక రచనలు రావాలి

- ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు ● మూడోరోజు కొనసాగిన కొండవీటి కళాపరిషత్ నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మూస ధోరణి, పాతకాలపు వృత్తాంతాలతో కాకుండా వర్తమాన, సామాజిక సమస్యలపై యువతను ఆకర్షించే విధంగా నాటక రచనలు రావాలని అనంతవరం ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు గుదే పాండురంగారావు అన్నారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు మూడవ రోజైన సోమవారం కూడా కొనసాగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాండురంగారావు నటరాజ పూజ చేయగా, స్థానిక సర్పంచ్ షేక్ కరిమున్ జ్యోతి ప్రజ్వలన చేసి మూడో రోజు నాటిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పరిషత్‌ల నిర్వహణ ఎంతో భారంగా మారిందన్నారు. ఈ రంగానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహిస్తే పది కాలాల పాటు నాటకాన్ని బతికించ వచ్చన్నారు. పరిషత్ ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన మూడో రోజు కార్యక్రమాల్లో పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరి, ప్రధాన కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు, పఠాన్‌యూసఫ్, ఆలోకం మోహనరావు, ముద్దన రాఘవయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

పంతాలకు పట్టింపులకు పోతే జరిగే అనర్థమే 'విడాకులు కావాలి'

దాంపత్య జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ బేదాలు, అపోహలు, చిన్నచిన్న సమస్యలు సహజమని, అంతమాత్రాన కలసి బతకలేమన్న తొందరపాటు నిర్ణయంతో పంతాలకు పోయి విడిపోవాలనుకుని జీవితాలను దుర్భరం చేసుకుంటున్న నేటి ఆధునిక దంపతుల పోకడను కొత్తకోణంలో ఆవిష్కరించినదే 'విడాకులు కావాలి' నాటిక. భారతీయ వివాహ వ్యవస్థలో సంస్కృతీ సాంప్రదాయాలు ఎలా సాంసారిక జీవితాలను అన్యోన్యంగా దారిదీపాలై నడిపిస్తున్నాయో వివరిస్తూ ఇచ్చి పుచ్చుకునే సంస్కార ధోరణితో దంపతులు పయనిస్తే దాంపత్యాన్ని ఆనందమయం చేస్తుందని సందేశాన్నిచ్చిన ఈ నాటికను అరవింద ఆర్ట్స్ , తాడేపల్లివారు ప్రదర్శించగా వల్లూరి శివప్రసాద్ రచన, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు.

శృతిమించిన టెక్నాలజీ 'నా శత్రువు'

నేడు మనిషి జీవితం టెక్నాలజీతో ముడిపడిపోయింది. సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్, సోషల్ మీడియాతో ఎక్కువ సమయం గడుపుతున్నారు. బంధాలకు, అనుబంధాలకు దూరమై ఒంటరిగా మిగిలిపోతున్నారు. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వినియోగిస్తే దానికి మించిన మిత్రుడు మరొకరు లేరని, మించితే జీవితంలో ఊహించని ప్రమాదాలు సంభవిస్తాయని తెలియజేసే సందేశాత్మక నాటిక 'నా శత్రువు'. జయ భేరి ఆర్ట్స్, హైదరాబాద్‌వారు సమర్పించిన ఈ నాటికను అక్కల తామేశ్వరయ్య రచించగా వడ్డాది సత్యన్నారాయణ దర్శకత్వం వహించారు.

బంధం బలపడాలంటే వరుసలతో పిలవాలని తెలిపే హాస్య కథనమే 'బావా ఎప్పుడు వచ్చితీవు'

కుటుంబ వ్యవస్థలో అమ్మ, నాన్న, చెల్లి, అక్క బావ అనే పిలుపులతో బంధాలు, బాంధవ్యాలు బలపడతాయి. ప్రేమానురాగాలు వర్ధిల్లుతాయని సందేశాన్నిస్తూ సాగుతుంది యడ్లపాడు మానవత వారు ప్రదర్శించిన 'బావా ఎప్పుడు వచ్చితీవు' నాటిక. వరుసలు కలిపి పిలిచే అమాయకపు భార్య, అపోహ, అభద్రతా భావం కలిగిన భర్త మధ్య కొన్ని విచిత్ర సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఆయా సంఘటనలన్నీ కడుపుబ్బ నవ్విస్తూనే ఎంతో సున్నితంగా కనువిప్పు కలిగిస్తుంది. ఆద్యంతం హాస్యరస భరిత సంఘటనల సమాహారమైన ఈ నాటికను స్వర్గీయ పివి భవాని ప్రసాద్ రచించగా, జరుగుల రామారావు దర్శకత్వం వహించారు.



విడాకులు కావాలి నాటికలోని ఓ సన్నివేశం



నా శత్రువు నాటికలోని సన్నివేశం

నంద్యాల మార్గంలో డీఆర్ఎం ఇన్‌స్పెక్షన్

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ నంద్యాల మార్గంలో ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. సోమవారం సెలవుదినం అయినప్పటికి డివిజనల్ రైల్వే అధికారులతో కలిసి ఆమె ఇన్‌స్పెక్షన్ రైల్ కార్‌లో గుంటూరు నుంచి బయలుదేరారు. సాతులూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం, నంద్యాల వరకు ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద డివిజన్ పరిధిలో మంజూరైన పనుల పురోగతిని పరిశీలన చేశారు. అలానే రైల్వేస్టేషన్లలో కంట్రోల్ రూంకు వెళ్లి రైళ్ల ఆపరేటింగ్‌ని పరిశీలించారు. స్టేషన్ మాస్టర్లు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా, లేదా అనేది తనిఖీ చేశారు. ఆయా రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు పరిశీలించారు. కొంత మంది ప్రయాణికులతో మాట్లాడి ఇంకా ఏమేమి సదుపాయాలు కావాలో అడిగి తెలుసుకున్నారు. డీఆర్ఎం వెంట ఏడీఆర్ఎం కే సైమన్, సీనియర్ అధికారులు జేవీ అనూష, డాక్టర్ ప్రదీప్‌కుమార్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో ఇన్‌స్పెక్షన్ నిర్వహిస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

గంజాయి విక్రేతల అరెస్టు

- 1.250 కేజీల గంజాయి స్వాధీనం ● సీఐ రాముల నాయక్

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ రాముల నాయక్ తెలిపారు. సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాముల నాయక్ స్వాధీనం చేసుకున్న గంజాయిని, నిందితుల వివరాలను తెలియజేశారు. సోమవారం మధ్యాహ్నం తెనాలి ఆర్‌టీసీ బస్టాండ్ అవుట్ గేట్ వద్ద ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సీఐ రాముల నాయక్ తన సిబ్బందితో దాడి చేసి తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పఠాన్ మెహబూబ్ సుభాని, పొన్నూరు మండలం దండమూడి గ్రామానికి చెందిన గంజేరుపల్లి శ్రీవర్ధన్‌లను అదుపులోకి తీసుకోగా మరొకరు పారిపోయాడన్నారు. వారు వినియోగించన ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. వారు చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాడు పడి ఒక ముఠాగా ఏర్పడి పొన్నూరుకు చెందిన షేక్ ఆసిఫ్ అనే వ్యక్తి నుంచి 1.250 కేజీల గంజాయిని రూ. 12.5 వేలుకు కొనుగోలు చేసి వాటిని తెనాలిలో పలు ప్రాంతాలలో చిన్న, చిన్న ప్యాకెట్‌లుగా విక్రయిస్తున్నారని తెలిపారు. వీరివద్ద నుంచి 1.250 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కరిముల్లా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలను తెలుపుతున్న సీఐ రాముల నాయక్, పక్కన ఎస్‌ఐ కరిముల్లా తదితరులు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ఫిరంగిపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములూరిపాడు సమీపంలో గోకుల్ టీస్టాల్ వద్ద గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొనగా ఆటో డ్రైవర్ గుంటుపల్లి మనోజ్(21) అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం మార్కాపురం నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గుంటూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్న ఆటోను ఢీకొంది. నరసరావుపేటకు చెందిన డ్రైవర్ మనోజ్ మృతి చెందగా ఆటోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన బండారు ఉమశ్రీ, కళ్యాణ్, మోక్షిక, రోహిత్, స్టాలిన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలి

- విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూపతి రాజు రవీంద్రరాజు ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరులోని ఎన్జీవో కల్యాణమండపంలో సోమవారం గుంటూరు ఉమ్మడి జిల్లాల ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బూపతి రాజు రవీంద్రరాజు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులకు ఇతర విధులను కేటాయించవద్దని ముఖ్యమంత్రి చెప్పినా ఉన్నాతాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రేషనలైజేషన్ విధానంలో రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా చేయడంతో గ్రామ రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య 50శాతం తగ్గిపోతుందన్నారు. ఈ విధానం నుంచి రెవెన్యూ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం పెట్టిన రూ. 25వేల బకాయిల్లో రూ. 7,200 కోట్లను కూటమి ప్రభుత్వం విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉమ్మడి ఐక్యచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, పల్నాడు, కృష్ణా, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రమేష్‌కుమార్ సభ్యులు వేణుగోపాల్, రఘునాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపతి రాజు రవీంద్రరాజు, పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 515.30 అడుగులు ఉంది. ఇది 140.84 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు సిటీ వార్తలు


నేడు విధులకు హాజరుకానున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో 10 రోజుల పాటు సెలవు పై విదేశాలకు వెళ్లిన కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సోమవారం గుంటూరు నగరానికి చేరుకు న్నారు. ఆమె మంగళవారం ఉదయం నుంచి యథాతథంగా కలెక్టరేట్‌లో విధులకు హాజ రౌతారని కలెక్టరేట్ అధికార వర్గాలు తెలిపాయి. కలెక్టర్ నాగలక్ష్మి సెలవులోకి వెళ్లినప్పటి నుంచి ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవతేజ అద నపు బాధ్యతల నుంచి రిలీవింగ్ అయ్యారు.

సాహసమే ఊపిరిగా ముందుకు సాగాలి

● రీజనల్ ఫైర్ ఆఫీసర్ జిలానీ

గుంటూరు సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపకశాఖలో పనిచేస్తున్న సిబ్బంది సాహసమే ఊపిరిగా ముందుకు సాగాలని రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఎంఏ క్యూ జిలానీ అన్నారు. ఎటువంటి విపత్తులైనా ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. గుంటూరు జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో జరిగిన వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత అగ్నిమాపక శాఖ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు, బీహార్ రాష్ట్ర అగ్నిమాపక శాఖ చెందిన ఫైర్ ఫైటర్ ఎస్‌హెచ్ రవికాంత్ మండల్ నివాళులు అర్పించారు. ప్రతి ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తామని, ప్రజల్లో అగ్ని ప్రమాదాలపై సంపూర్ణ అవగాహన కల్పించ డం ఆవశ్యకమని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ముక్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. సిబ్బం దిని కూడా సీజన్‌కు అనుగుణంగా తయారు చేయటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. అనంతరం వారోత్సవాల పోస్టర్లను, కరపత్రాలను రీజనల్ ఫైర్ ఆఫీసర్ జిలానీ చేతుల మీదుగా అవిష్కరింప చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్ని మాపక అధికారి కె.కృష్ణారెడ్డి, గుంటూరు-2 కేంద్ర అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



అగ్నిమాపక శాఖ వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలు అవిష్కరిస్తున్న రీజనల్ ఫైర్ ఆఫీసర్ జిలానీ, డీఎఫ్‌వో ముక్కు శ్రీనివాసరెడ్డి

గిరిజనుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ఆశయం

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన బిడ్డలకు మేలు చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో గిరిజనుల అభివృదిధకి కేవలం రూ.92 కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ఏర్పడిన సంవత్సరంలోపే వెయ్యి ఐదు కోట్లు నిధులను మంజూరు చేసిందన్నారు. ఆదా యం, రాజకీయ ప్రయోజనాలు వంటివి ఆశించకుండా గిరిజన బిడ్డలకు మేలు చేయాలనే లక్ష్యంతోనే పనిచేస్తుందన్నారు.కూటమి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను గాడిన పెట్టి అభివృద్ధికి బాటలు వేస్తుందని ఆయన పేర్కొన్నారు.

సందేశాత్మకంగా 'కనకపుష్యరాగం' నాటకం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్వీఆర్ క్లబ్ రీడింగ్ రూమ్, కొరిటెపాడు వేదికగా జరుగుతున్న డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకోత్సవాల్లో భాగంగా సోమవారం హెచ్‌వీఆర్ ఎస్ ప్రసాద్ నిర్వహణలో స్వర్గీయ రాఘవ రచించిన, ఎస్‌కే మిశ్రో దర్శకత్వం వహించిన దృశ్యవేదిక, విజయవాడ వారి కనకపుష్యరాగం నాటకం సందేశాత్మకంగా సాగింది. తొలుత జరిగిన సభా కార్యక్రమంలో వైకే నాగేశ్వర రావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు లంక లక్ష్మీనారా యణ, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాసరావు, నాట కోత్సవ కమిటీ సభ్యులు బొప్పన నరసింహారావు, కన్వీనర్ గుమ్మడి శ్రీమన్నారాయణ, కాట్రగడ్డ రామకృష్ణప్రసాదు, పొన్నూరు కళాపరిషత్ అధ్యక్షుడు ఆంజనేయులు నాయుడు, నాయుడు గోపి పాల్గొని వైకే నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కారాన్ని డోగిపర్తి శంకరరావుకు అందించి సత్కరించారు.



కనకపుష్యరాగం నాటకంలో ఓ సన్నివేశం

16న డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఉద్యోగాల అభ్యర్థులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నిర్వహిస్తున్నట్లు ఆదిత్య కాంపిటీషన్స్ అధి నేత సోమవారం తెలిపారు. ఈ నెల 16వ తేదీ బుధవారం స్థానిక బ్రాడీపేట శ్రీమాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఇతర ఫ్యాకల్టీ అధ్యాపకులు అవగాహన కల్పిస్తారని చెప్పారు. అభ్యర్థులు సమావేశ మందిరానికి ఒక గంట ముందే రావాలని.. హాజరయ్యే ప్రతి అభ్యర్థికి సైకాలజీ పుస్తకాన్ని ఉచితంగా ఇస్తామని వివరాలకు 91105 88864లో సంప్రదించాలని ప్రణయ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు.

సీహెచ్ మస్తానయ్యకు ఘన సన్మానం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉగాదిని పురస్కరించుకొని కళారత్న (హంస) అవార్డును ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అందుకున్న సందర్భంగా సోమవారం సత్కార సభ జరిగింది. అతిథులుగా సాహితీవేత్త ధనకుధరం సీతా రామానుజాచార్యులు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లే పల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ కమిటీ పాలక మండలి వారు పాల్గొని ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఊరు, పేరు, చిరునామా తెలియని సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి కొత్తపేటలో మృతి చెందాడు. కృష్ణమహామహల్ థియేటర్ ఏరియాలో సోమవారం చనిపోయి ఉండగా అక్కడి వారు కొత్తపేట పోలీసు వారికి సమాచారం ఇచ్చారు. మృతిని ఆచూకీ కొరకు మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరిచారు. మృతుని చేతిపై కృష్ణని పచ్చబొట్టు ఉందన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో 0863-2221815లో గాని, సీఐను 8688831320లో గాని సంప్రదించాలని పోలీసులు కోరారు.

జీజీహెచ్‌లో...



గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఊరు, పేరు, చిరునామా తెలియని సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఆయన జీజీహెచ్‌లో సోమవారం అపస్మారక స్థితిలో ఉండగా అక్కడ వారు డాక్టర్‌కి చూయించగా పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తు పట్టిన వారు కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో 0863-2221815లో గాని, సీఐను 8688831320లో గాని సంప్రదించాలని కోరారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు



లాడ్జి సెంటర్లో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి తదితరులు

అంబేడ్కర్ ఆశయాలే కూటమికి మార్గదర్శకం

● తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్

● వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ జయంతి

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలే కూటమికి మార్గదర్శకం అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. పొన్నూరు రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ జాతి, మత, భేదాల హద్దులను చెరిపేసిన మహోన్నత రూపం అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మీరావలి, గుడిమెట్ల దయా ర త్నం, ఎర్రగుంట్ల ఆనంద్, బత్తుల భాస్కర్, యర్రంశెట్టి గిరి, చాట్ల విజయ బాబు, దేవా, బాబురావు, అల్లం బాజీ, చల్లా ఆంజనేయ ప్రసాద్, అచ్చి కిరణ్, మధు, మాలయాద్రి తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ హితం కోసం పాటుపడాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. సోమవారం అంబే డ్కర్ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గంలో పలుచోట్ల ఏర్పా టు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి, దర్శనపు యాకోబు, మానుకొండ శివప్రసాద్, దాసరి రమణ, అమేష్ రాములు, జ్యోతి, లామ్ వర్ధన్‌రావు, రాజీవ్ ఆనంద్, కిరణ్, సుధీర్, గాడిదపాటి కోటేశ్వరరావు, నిరీక్షణ రావు, మార్క్, కార్పొ రేటర్ ఈరంటి వరప్రసాద్ పాల్గొన్నారు.

● గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నగరంలో ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పక్షాల నాయకులు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ జిల్లా అధ్య క్షుడు చిలకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పులివెందుల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ధ్రువ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాభిపురం రవీంద్రనగర్‌లోనున్న అనురాగ్ ఓల్డేజ్ హోమ్ కేర్ సర్వీసులో వృద్ధులకు పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. అంతకుముందు రాజీవ్‌గాంధీభవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల లతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బిక్కా సునీల్, బ్రహ్మం, జొన్న ల వెంకటరెడ్డి, యన్నం సుధీర్‌బాబు తదితరులున్నారు.



జడ్పీలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా తదితరులు

● గుంటూరు సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తన ఆలోచనలతో అందరినీ ప్రభావితం చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ స్ఫూర్తి ప్రదాత అని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా పరిషత్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం ఆమె ప్రసంగించారు. దళితులు, పీడితులు అందలాలు ఎక్కుతున్నారంటే అది అంబేడ్కర్ పెట్టిన బిక్ష మాత్రమేనని అన్నారు. రాజ్యాంగంలో అటువంటి వెసులుబాటు లేకపోతే చాలా కులాలు అణచివేతకు గురయ్యేవి అని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సిబ్బంది రాష్ట్ర నాయకుడు డాక్టర్ కూచిపూడి మో హన్ అన్నారు. సమాజంలో తలెత్తుకొని ధైర్యంగా బతకడానికి అనువైన అవకాశం ఇచ్చిన అంబేడ్కర్ సేవలు ఎనలేనివని జడ్పీ అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూల్‌పాల్ అన్నారు. కార్యక్ర మంలో అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్పొరేషన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్, అధికారులు, కార్పొరేటర్లు

● గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): భారతరత్న, ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన జీవితాంతం బడుగు, బలహీన వర్గా లకు సమాజంలో గుర్తింపు, అభివృద్ధికి విశేష కృషి చేశారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా తొలుత గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో విభాగాధిపతులు, కార్పొరేటర్లు, అధికారులతో అంబేడ్కర్ చిత్రపటానికి, అనంతరం లాడ్జి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేసన, డాక్టర్ నిమ్మల శేషయ్య, క్రాంతికుమార్ తదితరులు

● ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళుల ర్పించారు. కార్యక్రమంలో మల్లేశ్వరరావు, నిమ్మల శేషయ్య, కోలా అశోక్, రామకృష్ణ, కొల్లూరి హనుమంతరావు, కోటేశ్వరరావు, నాగుల్‌మీరా తదితరులున్నారు.

● కాంగ్రెస్ ఆధ్వర్యంలో తూర్పులోని శారదాలకాలనీ, పొన్నూరు రోడ్డు ప్రాంతాల్లో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి హాజరై అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళుల ర్పించారు. కార్యక్రమంలో నాయకులు అంబటి రత్తయ్య, షేక్ కరీమ్, కిరణ్, రామకృష్ణ, రెహమాన్ తదితరులున్నారు.

● బహుజన మహాసభ ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మహాసభ నాయకుడు జీఆర్ భగత్‌సింగ్, ఏపీ రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, తాడికొండ నరసింహారావు, విప్పర్ల ముత్తయ్య, సాంబయ్య, ముత్తమ్మ, తదితరులున్నారు.

● గుజ్జనగుండ్ల సెంటర్లో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పలువురు నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బత్తుల దేవానంద్, వాసి మళ్ళ విజయ్, భాగ్యారావు, సుశీలరావు, షఫి, ముత్యాలరాజు, పిల్లి మేరీ, పానుగంటి చైతన్య తదితరులున్నారు.

● అవగాహన సంస్థ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి కార్యక్రమం జరిగింది. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, భావన్నారాయణ, బాలినేని శివరామకృష్ణయ్య, పూర్ణచంద్రరావు, భాస్కరరావు, డేవిడ్, పీటర్ తదితరులున్నారు.

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్ర మంలో దార హేమప్రసాద్, కోటిరత్నం, వేణు గోళ్ళ కృపానందం ఉన్నారు.

● అరండల్‌పేటలోని కార్యాలయంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు భూపతి సునీల్, పి.ప్రకాష్, కోడిరెక్క కోటిరత్నం, చంద్రనాయక్, వాల్మీకి శ్రీనివాసరావు, మునియ్య, శ్యామల, నాగూర్‌బాబు, కుమార్ ఉన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తాడిశెట్టి మురళీ తదితరులు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ ఆధ్వర్యంలో పట్టాభిపురంలోని కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీపల్లి, నాయకులు ఖాజావలి, కొండెబోయిన శ్రీనివాసరావు పలువురు నాయకులున్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

● గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 14(ఆంధ్ర జ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించడమే [illegible] నివాళులని టీడీపీ నాయకులు అన్నారు. స్థానిక అరండల్‌పేట, టీడీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటా నికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజామాస్టారు, దామచర్ల శ్రీనివాస్, కసుకుర్తి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

● ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంత కార్యక్రమం జరిగింది. జిల్లా ప్రజా రవాణాధికారి రవికాంత్, గుంటూరు-1, 2 డిపో మేనేజర్‌లు రామకృష్ణ, అబ్దుల్ సలాం పలువురు అధికారులు అంబే డ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

● గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా సంఘ్ డివిజనల్ సెక్రెటరీ వీవీ రమణయ్య అంబేడ్కర్ కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శరత్‌బాబు, రవికుమార్, కిరణ్‌కుమార్, కృష్ణమోహన్, సౌజన్య బాయ్ పాల్గొన్నారు.



లాడ్జి సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

● గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. సోమవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని బీజేపీ ఎస్సీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేడ్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముం దుగా లాడ్జి సెంటర్లో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్ మకుటం శివ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

● గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే బీఆర్ అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ వ్యాఖ్యానించారు. లాడ్జి సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల తో నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. వర్గీకరణ విషయంలో సీఎం చంద్రబాబునాయుడు పాత్ర మరువలేనిదన్నా రు. కార్యక్రమంలో మాదిగ జన సేవాసమితి నాయకులు చావలి బాలస్వామి, అత్తోట జోసఫ్, హైకోర్టు న్యాయవాది గడ్డం ఎలీషా, పరంగీ సత్య రాజు, దాసరి జాన్ బాబు, కుక్కమళ్ళ సంజీవరావు, డొక్కా సురేష్, చిలువూరు విజయ్, జార్జ్, బీసీ సంఘాల నాయకులు తాడికొండ నరసింహారావు, గోపి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కె.రామకృష్ణ, జంగాల అజయ్‌కుమార్ తదితరులు

● గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం పెను ప్రమాదంలో పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి వరకు నిర్వహించిన ప్రచార ఆందోళన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సోమవారం లాడ్జీ సెంటర్లో అంబే డ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, షేక్. వలి, చల్లా చిన్న ఆంజనేయులు, షేక్ సుభాని, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగ పరిరక్షించుకోవడమే అంబేడ్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళులని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజి అన్నారు. లాడ్జి సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్య క్రమంలో ఎంఏ చిష్టి, దండా లక్ష్మీనారాయణ, ఎల్ అరుణ, లక్ష్మణరా వు, ముత్యాలరావు బైరగాని శ్రీనివాసరావు, కాకుమాను నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీనిలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాల యంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ పితా మహుడు, సమాజంలో సమానత్వ స్థాపనకు.. అంటరానితన నిర్మూలనకు, మహిళాభ్యుదయానికి కృషిచేసిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహా నికి ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.



పోలీస్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్

కంకరగుంట ఆర్‌యూబీ పనులపై అస్పష్టత

● ఇప్పటివరకు నోరు మెదపని నగరపాలక సంస్థ

● స్ట్రెయిట్‌కట్‌తో ఏటీ అగ్రహారం వైపు నుంచి వచ్చే ట్రాఫిక్ పరిస్థితి ఏమిటి?

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కంకరగుంట ఆర్‌యూబీకి ఆకుల వారి తోట వైపు నుంచి జరుగుతున్న స్ట్రెయిట్‌కట్ పనులపై అస్పష్టత నెలకొన్నది. ఈ రైలు మార్గం కింద వంతెనలోకి వాహనాలు వెళ్లాలంటే గతంలో కాస్త ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకొని ప్రవేశించాల్సి వచ్చేది. రేపటి రోజున శంకర్‌విలాస్ ఆర్‌వోబీ కూల్చివేసి నిర్మాణం చేపడితే కనీసం ఏడాదికి పైగానే ట్రాఫిక్ కంకరగుంట ఆర్‌యూబీ వైపు మళ్లించాల్సి ఉండటంతో తాము స్ట్రెయిట్‌కట్ చేస్తున్నామని నగరపాలకసంస్థ ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇక్కడ చేపట్టబోయే మార్పుల గురించి ఇప్పటి వరకు ఎలాంటి డిజైన్/నమూనాని కార్పొరేషన్ విడుదల చేయలేదు. స్ట్రెయిట్ కట్ చేస్తే ఏటీ అగ్రహారం వైపు నుంచి వచ్చే వాహనాలు ఆర్‌యూబీలోకి చేరుకోవాలంటే ఏ విధంగా మలుపు తీసుకోవాలనే దానిపై స్పష్టత కరువైంది. అలానే ఏటీ అగ్రహారం వైపు నుంచి కలెక్టరేట్ వైపునకు వెళ్లే వాహనాలు ఎదురుగా వచ్చే వాహనాలకు క్లాష్ కాకుండా ఎలా చేస్తారన్నది సస్పెన్స్‌గా మారింది. నగరపాలకసంస్థ ఇంజనీరింగ్ అధికారులు మాత్రం తమ వద్ద సమాధానం ఉందని చెబుతున్నారే తప్పా ఆ కిటుకు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

కంకరగుంట ఆర్‌యూబీని కొన్ని ప్రత్యేక పరిస్థితుల వల్ల ఇంచుమించు పదేళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో బ్రాడీపేట 14వ అడ్డరోడ్డులో ఉన్న లెవల్ క్రాసింగ్ గేటుని తొలగించేందుకు రైల్వే శాఖ దీనిని అనుమతించింది. అప్పట్లో తొలుత ఒక డిజైన్‌ని ఆమోదించారు. వర్షం పడినా చుక్కనీరు కూడా ఆర్‌యూబీ కిందకు వెళ్లకూడదన్నది రైల్వే శాఖ ఆలోచన. దాని ప్రకారం ఆర్‌సీసీ బాక్సులను ఇరువైపులా ఎక్కువ దూరం నిర్మించి వాటి పైగా ఎలివేటెడ్ రోడ్లను ప్రతిపాదించారు. అయితే అందుకు ఆర్‌యూబీకి ఇరువైపులా భారీగా భవనాలను తొలగించాల్సి వస్తుంది. అప్పట్లో అంత వ్యయం భరించ లేమని నగర పాలకసంస్థ చెప్ప డంతో అప్రోచ్ డిజైన్ మార్చారు. రెండు వైపులా యూటర్న్ తీసుకొన్న తర్వాతనే వాహనాలు ఆర్‌యూబీలోకి ప్రవేశిస్తాయి. దీనివల్ల ఓపెన్ ఎయిర్ కావడంతో వర్షం వస్తే నాలుగు అడుగుల కంటే ఎక్కువ లోతులో నీరు నిలబడుతున్నది. అలానే వాహనా లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనే పరిస్థితులున్నాయి. ప్రస్తుతం ఇటువైపు అంతగా ట్రాఫిక్ లేకపోవడం వల్ల సమస్య ఉత్పన్నం కావడం లేదు. రేపటి రోజున శంకర్‌విలాస్ ఆర్‌వోబీని మూసేస్తే బ్రాడీపేట, కృష్ణనగర్, కోబాల్డ్ పేట ట్రాఫిక్ అంతా ఆర్‌యూబీ కిందకే వస్తుంది. దీని వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని చెబుతూ నగరపాలకసంస్థ అధికారులు ప్రస్తుతానికి ఏటీ అగ్రహారం వైపునకు స్ట్రెయిట్‌కట్ పనులు ప్రారంభించారు. అయితే ఇక్కడ ఏటీ అగ్రహారం వైపు నుంచి వచ్చే వాహనాలు ఆర్‌యూబీలోకి వెళ్లాలంటే యూటర్న్ తీసుకోవాలి. అప్పుడు ట్రాఫిక్ స్తంభించపోయే పరి స్థితులుం టాయి. అలానే కలెక్టరేట్ వైపు వెళ్లాలన్నా క్లాష్ అవుతాయి. స్ట్రెయిట్‌కట్ చేసిన ప్రదేశంలో పీకలవాగు వంతెన చాలా ఇరుకుగా ఉన్నది. దానిని రెండింతలు పెంచాలి. అంత చేసినా ఇక్కడ బహుళ అంతస్తుల భవనాలు మూడు అడ్డుగా ఉన్నాయి. వాటి వద్ద ప్రత్యామ్నాయం ఏమిటన్నది తెలియకుండా ఉన్నది. వీటన్నింటిపై స్పష్టత ఇవ్వాలని స్థానిక ప్రజలు నగరపాలకసంస్థ అధికారులను కోరుతున్నారు.



కంకరగుంట ఆర్‌యూబీ వద్ద జరుగుతున్న స్ట్రెయిట్‌కట్ పనులు

ఎల్‌ఆర్ కాలనీలో వృద్ధురాలి అదృశ్యం

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్‌ఆర్ కాలనీలో వృద్ధురాలు అదృశ్యమయ్యారు. ఎల్‌ఆర్ కాలనీ 2వ లైనుకు చెందిన దుద్దిపూడి ప్రభావతి (80) సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం బంధువులు, తెలిసి వారి ఇళ్ళ వద్ద గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

ముత్యాలరెడ్డినగర్‌లో వ్యక్తి...

స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాలరెడ్డినగర్ 6వ లైనుకు చెందిన నల్లమోతు అనిల్ కుమార్ (40) అదృశ్యమయ్యాడు. అనిల్‌కు మార్ కరోనా సమయం నుంచి లివర్ దెబ్బతినడంతో అనారోగ్య కారణంగా బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో అప్పులపాలయ్యాడు. దీంతో ఈ నెల 12న ఉదయం తెనాలి వెళ్ళి డబ్బులు ఇచ్చి రావాలి అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్ళాడు. తరువాత భార్యకి ఫోన్ చేసి శ్రీశైలం వెళ్తున్నా ఇక ఇంటికి రాను అని చెప్పి ఎక్కడికో వెళ్లిపోయాడు. ఇంతవరకూ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య మంజూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపేదల కాలనీలో వివాహిత...

అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరుపేదల కాలనీకి చెందిన గుంజి అలియాస్ వల్లెపు కల్పన (30) అదృశ్యమైంది. కల్పన, రాంబాబుకు ఏడాది క్రితం వివాహమైంది. భార్యా భర్తలకి గొడవ జరిగిన ప్రతిసారి ఎక్కడికైనా వెళ్లిపోతాను అని బెదిరిస్తుండేది. ఈ నెల 10న ఆమె భర్త మద్యం తాగిన విషయమై వారిద్దరి మధ్య గొడవ జరిగినట్లు, సాయంత్రం పాల పాకెట్ తీసుకు వస్తాను అని చెప్పి ఇంటి నుండి బయటికి వెళ్ళి ఇంత వరకూ తిరిగి ఇంటికి రాలేదు. ఆమె భర్త రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు అరండల్ పేట పోలీసులకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.


మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తీకేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్ల అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురు లంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

సమర్థ నాయకత్వానికే పట్టం

- ప్రజలు, కార్యకర్తల ఆమోదంతోనే సీట్లు, పదవులు
- నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి
- పథకాల అమల్లో వివక్ష ఉండకూడదు
- అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు
- తప్పుచేసిన వారిని తప్పకుండా శిక్షిస్తాం
- కార్యకర్తలెవరూ తొందరపడవద్దు
- మే నెల నుంచే మూడు పథకాలు అమలు
- తాడికొండ కార్యకర్తల సమీక్షలో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు



బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా ముందుకు వచ్చిన ప్రముఖులనుద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

గుంటూరు(తాడికొండ), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, కార్యకర్తల ఆమోదం ఉంటేనే ఏ నాయకుడికైనా సీటు, పదవి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తేల్చి చెప్పారు. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటే పార్టీలో విశిష్ట గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యకర్తలకు దూరంగా ఉండే ఎలాంటి నాయకుడినైనా ఉపేక్షించేది లేదన్నారు. సోమవారం గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో తాడికొండ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

తప్పుడు ప్రచారం చేస్తే తాట తీస్తాం

'వైసీపీ ఓ ఫేక్ పార్టీ. వివేకానందరెడ్డిని హత్య చేసి నాపైకి నెట్టారు. పాస్టర్ ప్రవీణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో చనిపోతే ప్రభుత్వంపై బురదజల్లారు. చల్లిన బురద కడు క్కోమంటే కుదరదు. తప్పుడు ప్రచారం చేస్తే తాటతీస్తాం. సొంత పేపర్, చానల్ ఉంది కదా అని ఏదిపడితే అది రాస్తాం, ప్రసారం చేస్తాం అంటే చూస్తూ ఊరుకోం. బూతు రాజకీయాలకు స్వస్తి చెప్పడానికి శ్రీకారం చుట్టాం. తప్పుచేసిన వారిని తప్పకుండా శిక్షిస్తాం. కార్యకర్తలెవరూ తొందరపడవద్దు. లిక్కర్, ఇసుక విధానంలో పారదర్శకంగా ఉండాల్సిందే. ఇందులో ఎలాంటి మొహమాటం ఉండదు. కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతం విషయంలో రాజీపడొద్దు' అని సీఎం చంద్రబాబు సూచించారు.

కార్యకర్తలను చూస్తే ఉత్సాహం రెట్టింపు అవుతోంది

'తాడికొండ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులను కలు సుకోవడం చాలా ఆనందంగా ఉంది. కార్యకర్తలను చూస్తే నాకు జోష్ వస్తుంది. టీడీపీని ఓడించే శక్తి ఎవరికీ లేదని నియోజకవర్గ కార్యకర్తలు రుజువు చేశారు. సుదీర్ఘకాలం ప్రభుత్వం కొనసాగితే మనం చేపట్టే పనులు నిరాటంకంగా ముందుకెళ్లి రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. గుజరాత్‌లో బీజేపీ అయిదు సార్లు వరుసగా గెలిచింది. మనం కూడా ఆ స్ఫూర్తిని భవిష్యత్తులో కొనసాగించాలి. 2019లో గెలిచి ఉంటే రాజధాని పూర్తయ్యేది. ప్రభుత్వం నిలకడగా ఉండక పోవడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతిని ప్రజలు నష్టపోయారు. నేను కార్యకర్తలకు దగ్గరగా ఉంటా. మీ ప్రాంతాల్లో మీతోనే పనిచేయిస్తా. నేను తీసుకునే ప్రతి నిర్ణయం రాష్ట్రాన్ని నిలబెట్టడం, ప్రజల ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండడం కోసమే.' అని చంద్రబాబు అన్నారు. కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి సీఎం చేసిన కీలక వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే..

కార్యకర్తలకు అండగా నిలబడడం మన బాధ్యత

టీడీపీ కార్యకర్తలు 2019-24 మధ్య ప్రాణాలను పణంగా పెట్టి పార్టీ కోసం నిలబడ్డారు. వాళ్ల అంకితభావాన్ని మనం గౌరవించాలి. వారి కుటుంబాలకు అండగా నిలవాలి. వైసీపీ కార్యకర్తలు, నాయకులు మన కార్యకర్తల మెడపై కత్తి పెట్టి జై జగన్ అనాలని కోరినా... జై చంద్రబాబు అని ప్రాణాలి చ్చారే తప్ప ఎక్కడా తలవంచని ధైర్యం కార్యకర్తలది. మొన్నటి వరకు తాడికొండ నియోజకవర్గం చాలా వెనుకబడిన ప్రాంతంగా ఉండేది. నేడు వేరొక స్థాయిలో నిలబడుతోంది. 45 రోజుల్లో 1.05 కోట్ల సభ్యత్వాలు చేసి రికార్డు సృష్టించాం. బూత్, యూనిట్, క్లస్టర్ అనే యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకుని పార్టీ నాయకులు, కార్యకర్తల పనితీరును పర్యవేక్షిస్తున్నాం. గతంలో పార్టీ ఇచ్చిన కార్యక్రమాలన్నింటిని పరిశీలించి కార్యకర్తలకు ర్యాంకులు ఇచ్చాం. పార్టీ నాయకులు, కార్యకర్తలు నైపుణ్యం పెంచుకోవాలి. పార్టీలో మహిళలను మరింత గౌరవించడంతో పాటు కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యం పెంచాలి. ప్రజల ఆమోదమే ఒక నాయకుడు పోటీ చేయాలా? లేదా? అనే దానికి ప్రామాణికం. కేఎస్ఎస్ (కుటుంబ సాధికార సారథి), బూత్, క్లస్టర్, యూనిట్ విభాగాల్లో మహిళలు, మగవారికి సమాన అవకాశాలు ఇస్తున్నాం. టీడీపీకి వెనుకబడిన వర్గాలే వెన్నుముక.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సీఎం చంద్రబాబు, చిత్రంలో జిల్లా నేతలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నసీర్ అహ్మద్, పిల్లి మాణిక్యరావు తదితరులు

కష్టపడేవారికే పదవులు

సమర్థవంతమైన నాయకత్వం ఉంటే నియోజకవర్గంలో పార్టీకి తిరుగు ఉండదు. నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాలి. కుప్పంలో కూడా నేను ఉండే బూత్‌లో 20 కుటుంబాలు ఓట్లు వేసేలా చూడాల్సిన బాధ్యతను తీసుకుం టున్నా. ఎమ్మెల్యేలు, నాయకులు కూడా ఇదే తీరును అమలు చేయాలి. ఏ నాయకుడైనా తన సొంత బూత్ స్థాయిలో పనిచేయాలి. అప్పుడే క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుస్తుంది. నాయకులను కార్యకర్తలు, ప్రజలు ఒప్పుకోకపోతే నా దగ్గరకు రానిచ్చే పరిస్థితి కూడా ఉండదు. పథకాల అమలులో వివక్ష ఉండదు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందజేస్తాం. ప్రమాదంలో చనిపోయిన కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల బీమా ఇచ్చే ఏకైక పార్టీ మనదే. 43 ఏళ్లగా ఎత్తిన జెండాను దించకుండా నిలబడుతున్న కార్యకర్తలను అన్ని విధాలా ముందుకు తీసుకెళ్లడం కుటుంబ పెద్దగా నా బాధ్యత. రాజధానిలో తెలుగుదేశం జెండా శాశ్వతంగా ఎగరాలి.

మే నుంచే మూడు పథకాల అమలు

వచ్చే నెల నుంచే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాలు అమలు చేస్తాం. దీనివల్ల పిల్లలను పాఠశాలలకు పంపించే తల్లులు, వ్యవసాయం చేస్తున్న రైతులు, చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుంది. ఎన్ని కష్టాలు ఎదురైనా సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి తీరుతాం అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఐపీఎల్ బరిలో రషీద్

- తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ తరపున అరంగేట్రం
- ఓపెనర్‌గా అవకాశం కల్పించిన జట్టు యాజమాన్యం



గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన యువ క్రికెటర్ షేక్ రషీద్ ఎట్టకేలకు ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో అరంగేట్రం చేశాడు. అండర్-19 భారత క్రికెట్ జట్టులో సభ్యుడిగా ఉన్న రషీద్‌ని గత ఏడాదే వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు దక్కించుకొన్నది. అయితే ఆ జట్టు సీనియర్ క్రికెటర్లు బాగా ఆడటం వలన గత ఏడాది ఐపీఎల్‌లో ఆడే అవకాశం దక్కలేదు. ఈ ఏడాది కూడా రషీద్‌కి అవకాశం లభిస్తుందో, లేదోనని అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు చెన్నై జట్టు ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శన ప్రదర్శిస్తున్నది. దీంతో జట్టు కెప్టెన్‌గా తిరిగి ఎంఎస్ ధోనీ ఎంపిక కావడంతో సోమవారం లక్నో సూపర్ జైంట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రషీద్‌కి ఓపెనర్‌గా అవకాశం కల్పించాడు. ఇందుకు టీమ్ మేనేజ్‌మెంట్ కూడా సహకరించింది. ఆడుతున్నది తొలి మ్యాచ్ అయినా రషీద్ ఎలాంటి తడబాటుకు గురికాకుండా కేవలం 19 బంతుల్లో 27 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. దీంతో జిల్లాలోని క్రికెట్ అభిమానులు ఆనందోత్సాహాలు వ్యక్తపరిచారు.

జన్మభూమిని మర్చిపోవద్దు

అంబేడ్కర్ విదేశీ విద్యానిధి లబ్ధిదారులతో వర్చువల్‌గా మాట్లాడిన ముఖ్యమంత్రి

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం పొన్నెకల్లు గ్రామంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పీ-4 సమావేశంలో ఆయన అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం ద్వారా చదువుకుని విదేశాల్లో స్థిరపడినవారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో నెట్వర్క్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కొరివి రత్నలత, కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అనీల్‌తో వర్చువల్‌గా మాట్లాడారు. అదే సమయంలో వేదికపైనున్న రత్నలత తండ్రి భావోద్వేగానికి గురై కంటనీరుపెట్టుకుని 'జీవితాంతం రుణపడి ఉంటా' అంటూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నా ఉన్నతికి సీఎం చంద్రబాబే కారణం

కొరివి రత్నలత, నెట్‌వర్క్ ఇంజనీర్, ఆస్ట్రేలియా

అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం ద్వారా నాకు ఆర్థిక సాయం చేసి నేను ఇంతటి ఉన్నతస్థానంలో ఉండేలా సహకరించిన సీఎం చంద్రబాబుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మాది గుంటూరు జిల్లా వేములూరుపాడు గ్రామం. దిగువ మధ్య తరగతి కుటుంబం. 2014లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చేశాను. విదేశీ విద్యా పథకం గురించి తెలుసుకుని నా తండ్రి అప్లయ్ చేయమన్నారు. నాకు పథకం కింద రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందింది. విదేశీ విద్యతో నా జీవితం మారిపోయింది. సార్ ... మీరు చేసిన సాయం జీవితంలో మర్చిపోలేను. యువతకు మీరు ఆదర్శం.

రత్నలత తండ్రి : నా బిడ్డ ఉన్నతికి కారణమైన సీఎం చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటానంటూ రత్నలత తండ్రి భావోద్వేగానికి లోనయ్యారు. చంద్రబాబు చేసిన సాయం ఎప్పటికీ మర్చిపోమని కంటనీరు పెట్టుకున్నారు.

సీఎం చంద్రబాబు : మారుమూల గ్రామంలో పుట్టిన ఆడబిడ్డ ఆస్ట్రేలియాలో పై చదువులు చదివి ఇంజనీర్ అయినందుకు గర్వపడుతున్నాను. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని యువత మరింత పైకి రావాలి.

ఏడాదికి రూ. 60 లక్షలు సంపాదిస్తున్నా...

అనిల్, ఇంజనీర్, కెనడా

మాది గుంటూరు జిల్లా తెనాలి. మాది వ్యవసాయ కుటుంబం. నా తల్లిదండ్రులు చదువుకోలేదు. మా అమ్మమ్మ రోడ్లు ఊడ్చి నన్ను చదివించింది. తెలుగుమీడియంలో చదివాను. అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం ద్వారా కెనడాలో మాస్టర్స్ చదివే అవకాశం వచ్చింది. నాకు పథకం కింద రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందింది. నేనిప్పుడు ఏడాదికి రూ. 60 లక్షలు సంపాదిస్తున్నానంటే అందుకు చంద్రబాబే కారణమని గర్వంగా చెబుతున్నా.

సీఎం చంద్రబాబు : మనం రూ. 10 లక్షలు సాయం చేస్తే ఇప్పుడు అనిల్ రూ. 60 లక్షలు సంపాదిస్తున్నాడు. భవిష్యత్‌లో రూ. కోటి సంపాదించాలని కోరుకుంటున్నాను. చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరిన వారిని చూస్తే గర్వంగా అనిపిస్తుంది. అనిల్, రత్నలత లాంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలి. బాగా చదువుకుంటే జీవితంలో మంచిగా స్థిరపడొచ్చు. ఇష్టపడి చదువుకుంటే కష్టం కూడా ఇష్టం అవుతుంది. అప్పుడు మీ లక్ష్యం తేలిగ్గా చేరుకోవచ్చు. అంబేడ్కర్ జయంతి రోజున పీ4 కార్యక్రమం కింద ఒకటి లేదా రెండు కుటుంబాలను అనిల్, రత్నలత దత్తత తీసుకోవాలి. కర్మభూమిలో పనిచేయండి. జన్మభూమిని మర్చిపోవద్దు. ముఖ్యమంత్రి సూచనతో సొంతూరిలో పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అనిల్, రత్నలత ముందుకొచ్చారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు


చిన్నారులు, యువతులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


సీఎం చంద్రబాబుకు పైనాపిల్ గజమాలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు


బాలుడిని ఆప్యాయంగా పలుకరిస్తున్న ముఖ్యమంత్రి

స్కేటింగ్ పోటీల్లో హాశిష్‌కు సిల్వర్‌మెడల్


సిల్వర్ మెడల్ సాధించిన హాశిష్

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రంలోని మొహాలి ప్రాంతంలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 17వరకు జరుగుతున్న ద్వితీయ ఇంటర్ డిస్ట్రిక్టు ఛాంపియన్‌షిప్ - 2025 పోటీల్లో ఆదివారం తాడేపల్లి పట్టణం డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హాశిష్ వెండి, రజిత పతకాలు సాధించారు. పోటీల్లో ఐదు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. గుంటూరు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ తరపున ఏపీ నుంచి హాశిష్ పాల్గొని స్కేటింగ్ 12-15 సంవత్సరాల విభాగంలో ఇన్‌లైన్ ఫ్రీ స్టైయిల్‌లో సిల్వర్ మెడల్, సోలో డాన్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా హాశిష్‌ను టీమ్ ఇండియా కోచ్ సత్యనారాయణ, రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి థామస్, చిలుకూరి నీలిమ, శ్రీకాంత్‌రెడ్డి, హరిబాబు అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


శృంగారపురంలో సీఎం సహాయనిధి నగదు చెక్కును అందిస్తున్న కూటమి నాయకులు

దుగ్గిరాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శృంగారపురం గ్రామానికి చెందిన కోగంట వెంకటేశ్‌కు చెందిన కవల పిల్లల వైద్యఖర్చుల కోసం, స్థానిక నాయకులతో కలిసి మంత్రి నారా లోకేశ్‌ను సాయం కోరారు. స్పందించిన లోకేశ్ వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.7,53,240 లను మంజూరు చేశారు. సీఎం సహాయనిధి నగదు చెక్కును సోమవారం స్థానిక నాయకుల చేతుల మీదుగా అందించారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీసర్పంచ్ మొవ్వా చంద్రశేఖరరావు, దుగ్గిరాల యార్డు మాజీ చైర్మన్ కొండూరు ముత్తయ్య, యలవర్తి అంకమయ్య, గూడూరు సునీల్, జూపల్లి వెంకటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

పంగులూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ నాగూర్ మీరా (32) మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. అద్దంకి నుంచి ఆటో ఫారం కోళ్ల లోడుతో గుంటూరుకు బయలుదేరింది. సోమవారం తెల్లవారుజామున ఆటో నడుపుతున్న నాగూర్‌మీరా ముప్పవరం సమీపంలో జాతీయ రహదారి పక్కన మూత్ర విసర్జన కోసం వాహనం నిలిపి దిగుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఆటో డ్రైవర్‌ను ఢీకొట్టగా మృతి చెందాడు. ఆటో డ్రైవర్ నాగూర్ మీరాని గుంటూరు సమీపంలోని చౌడవరం గ్రామవాసిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చి రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

● జిల్లా రైతు సంఘం కార్యదర్శి అజయ్‌కుమార్


పేరేచర్ల పొలాల్లో రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మేడికొండూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మేడికొండూరు మండలం పేరేచర్ల సమీప పొలాల్లో సోమవారం మిర్చి రైతులను కలసి సమస్యలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 20వేలు ఉన్న క్వింటాల్ మిర్చి ధర ప్రస్తుతం మార్కెట్లో ఎనిమిది వేల నుంచి తొమ్మిది వేల రూపాయలు వరకు అమ్ముకోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రధానంగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈ క్రాప్ చేయకపోవడం వల్ల అనేక మంది రైతులు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సిన స్థితి ఏర్పడిందని ఆరోపించారు. గ్రామాల వారీగా మిర్చి సాగుచేసిన కౌలు రైతులందరిని క్షేత్రస్థాయిలో గుర్తించాలని, ఈ క్రాప్ నమోదు కాని మిర్చి రైతులను గుర్తించి ఎకరాకు ఐదు క్వింటాళ్ల చొప్పున లెక్కించి క్వింటాల్‌కు రూ.5వేల బోనస్ ఇవ్వాలని, ఈక్రాప్ నమోదైన రైతుల నుంచి క్వింటాల్ రూ.15 వేలకు కొనుగోలు చేయాలని అజయ్‌కుమార్ డిమండ్ చేశారు. డిమాండ్‌ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కైలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన గుంటూరు మిర్చియార్డు వద్ద నిర్వహించనున్న ధర్నాకు మిర్చి రైతులందరు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి బాషా, రైతులు పాల్గొన్నారు.

12న బుద్ధ పూర్ణిమ వేడుకలు

మంగళగిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయల్ బాంకెట్ హాల్లో మే 12వ తేదీన బుద్ధ పూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు తెలిపారు. ఈ మేరకు మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు అధ్యక్షతన సోమవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఏడుగురు సభ్యులతో కూడిన వర్కింగ్ కమిటీని నియమించారు.

అట్టహాసంగా అంబేడ్కర్ జయంతి వేడుకలకు..

● వేలాదిగా తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు
● పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు, యువత
● కార్యకర్తల్లో జోష్ నింపిన సీఎం చంద్రబాబునాయుడు


సీఎం చంద్రబాబును చూసి కేరింతలు కొడుతున్న యువతీ, యువకులు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. సోమవారం సీఎం చంద్రబాబునాయుడు పొన్నెకల్లులో పర్యటించి అంబేద్కర్ జయంతి ఉత్సవాలతో పాటు, పీ-4 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఉండవల్లి నివాసం నుంచి సీఎం హెలీక్యాప్టర్‌లో పొన్నెకల్లు చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద నియోజకవర్గం నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి సీఎంకు స్వాగతం పలికారు. ప్రతిఒక్కరిని అప్యాయంగా పలకరిస్తు సీఎం ముందుకు సాగారు. చిన్నారులు, యువత సీఎంతో సెల్ఫీలు దిగటానికి ఉత్సాహం చూపించారు. భద్రత కారణాల రీత్యా పోలీసులు వారిని ముఖ్యమంత్రి వద్దకు పంపించకపోయిన గమనించిన చంద్రబాబు నాయుడు యువత, చిన్నారులతో ఫొటోలు దిగారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి ఆర్పించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని నవీన్ ఇంటికి వెళ్లి వారితో కాసేపు సరదగా గడిపారు. నవీన్ కుటుంబసభ్యుల సమస్యలు తెలుసుకొని వారిని అదుకుంటానని హమీ ఇచ్చారు. చిన్నారులకు టిఫిన్ తినిపించారు. అనంతరం ప్రజావేదిక వద్దకు చేరుకొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చంద్రబాబు ప్రజావేదిక వద్దకు చేరుకోగానే యువత, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారిని ఉత్సహపరచటానికి విక్టరీ సింబల్ చూపించారు. దీంతో మహిళలు, యువత ఈలలు వేస్తు తమ ఆనందాన్ని పంచుకున్నారు. అంబేడ్కర్ వేడుకలు అనంతరం, పీ-4 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కావాలని తెలిపారు. అనంతరం నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూకతోటి మరియమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్న కుమార్, అధికార ప్రతినిధి గుంటుపల్లి మదుసూదనరావు, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు, యడ్లపల్లి సాంబశివరావు, వాసిరెడ్డి జయరామయ్య, గడ్డిపాటి సాంబశివరావు, షేక్ సుభాని, చిగురుపాటి అనూఫ్, సింగు కోటేశ్వరరావు, దగ్గుమల్లి శ్రీనివాసరావు, షేక్ రిజ్వాన, ధూళిపాళ్ల ఏసుబాబు, కంచర్ల సాంబశివరావు, నీలాల కృష్ణారావు, వడ్లమూడి సుధీర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతేటి బ్రహ్మయ్య, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేతపూడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఘన నివాళి


మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించిన కూటమి నేతలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను మంగళగిరిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో నేతలు, కార్యకర్తలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి మిఠాయి పంపిణీ చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి తాలూకా సెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఎస్సీ సెల్ గుంటూరు పార్లమెంటు అధ్యక్షుడు వేమూరి మైనర్‌బాబు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ యర్రగుంట్ల బాగ్యారావు మాట్లాడుతూ అంటరానితనం, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేయడటమే కాకుండా బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో టీడీపీ హయాంలో దేశంలోనే మొట్టమొదటి సారిగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లు, దళితుల కేసుల సత్వర పరిష్కారానికి మొబైల్ కోర్టులు, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, గుత్తికొండ ధనుంజయరావు, మన్నెం రమేష్‌బాబు, మద్దిరాల రమేష్, ఈపూరి పెద్దబ్బాయ్, వెలగపాటి విలియం, కట్టెపోగు ఉదయబాస్కర్, మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణ, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 20వ వార్డులో సర్దార్ దిడ్లా సత్యానందం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అన్నదానం నిర్వహించారు. పెదవడ్లపూడిలోని అంబేడ్కర్ కాలనీ రావిచెట్టు సెంటరులో అంబేడ్కర్ విగ్రహానికి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, నేతలు మాదల రమేష్‌బాబు, యేళ్ల శివరామయ్య, గుర్రం రామారావు, అన్నే చంద్రశేఖర్ తదితరులు నివాళులు అర్పించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారం రోజులుగా సమ్మె చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. పాతమంగళగిరిలో అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నేతలు నివాళులు అర్పించారు. ఎంటీఎంసీ కార్యాలయంలో కమిషనర్ అలీం బాషా, అధికారులు, సిబ్బంది అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నేతలు శివరాం బాబాజీ, జంజనం వరప్రసాద్, కాట్రు ధనుంజయరావు తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎంఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ కలకోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నేతలు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి : సీపీఎం

బీజేపీ మతోన్మాద శక్తుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సీపీఎం, కేవీపీఎస్ పట్టణ కమిటీల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు జేవీ రాఘవులు, ఎం చలపతిరావు, ఎం బాలాజీ, పీ బాలకృష్ణ, చెంగయ్య, ఎస్ కోటేశ్వరరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● **తాడేపల్లి/తాడేపల్లి టౌన్, (ఆంధ్రజ్యోతి):** తాడేపల్లి మండలం, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, సీపీఎం, సీపీఐ, వైసీపీ, పలు పార్టీల కార్యాలయాల వద్ద నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో, పలువురు న్యాయవాదుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పలువురు నేతలు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. మంగళగిరి బార్ అసోసియేషన్‌లో బార్ అధ్యక్ష, కార్యదర్శులు లంకా శివరామ్‌ప్రసాద్, కురగంటి రమేష్, తాడేపల్లి బ్రహ్మానందపురంలో న్యాయవాదులు మాలపాటి సురేంద్ర, కోటేశ్వరమ్మల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో సంస్థ ఎండీ రోనంకి కూర్మనాథ్ నేతృత్వంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్ఐ ఖాజావలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కేఎల్‌యూలో రిజిస్ట్రార్ కె.సుబ్బారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

● **దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలుగ్రామాల్లో బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ ఉన్నం ఝాన్సీరాణి, దేవరపల్లి చంటి, నాయుడు బాబూరావు, గద్దె శ్రీనివాస్, నక్కా చిరంజీవి, పినపాటి కరుణాకర్, కాబోతు దేవదాసు, పసుపులేటి రవియాదవ్, అద్దేపల్లి జయరాజు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ మండల కార్యాలయం, చిలువూరు రైల్వేగేటు వద్ద, దళితవాడ, ఈమనిసెంటర్, పెనుమూలి, కేఆర్ కొండూరు గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుగ్గిరాలలో సీపీఎం నాయకులు జెట్టి బాలరాజు, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, నడకుదురు యోగేశ్వరరావు, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ప్రపంచ జ్ఞానానికి దిక్సూచి అంబేడ్కర్

● డీబీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు


మేడికొండూరు మండలంలో అంబేడ్కర్ జయంతి

ఫిరంగిపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ జ్ఞానానికి దిక్సూచిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉన్నారని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు అన్నారు. సోమవారం ఫిరంగిపురంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా శాంతిపేట వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాణానికి రూపశిల్పి అంబేడ్కర్ అన్నారు. మానవులకు హక్కులు కల్పించిన మహానుభావులు అన్నారు. మానవులు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, సౌభ్రాతృత్వాలు పొందాలని రాజ్యాంగాన్ని నిర్మిస్తే కొందరు అరాచక శక్తులు కుల వ్యవస్థ అరాచకం, వివక్షతను పాటిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా డీఈవో వెంకటప్పయ్య మాట్లాడుతూ దళితులు ఐక్యంగా బాగా చదువుకొని అభివృద్ధి పథంలో పయనించాలని ఆయన కోరారు. అనంతరం ఫిరంగిపురంలో అంబేడ్కర్ జెండాలతో యువత భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ ఎన్ సింగయ్య, కాకి రామారావు, దాసరి సురేష్, నూతలపాటి ఫ్రాన్సిస్, మండలంలోని దళిత నాయకులు పాల్గొన్నారు.

● **మేడికొండూరు, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం, బీజేపీ, దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. పేరేచర్లలో సోమవారం రాత్రి అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో నుంచి పేరేచర్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తామని వారు నినాదాలు చేశారు. ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం సమసమాజ స్థాపన కోసం వారు చేసిన సేవలు మరువలేనివని ఆయన సేవలను కొనియాడారు.

● తుళ్లూరు (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాల మహానాడు ఆధ్వర్యంలో తుళ్లూరులో అంబేడ్కర్ ఆశయాలు పేర్కొంటూ ర్యాలీ నిర్వహించారు.

సందేశాత్మకంగా 'కనక పుష్యరాగం' నాటకం


కనక పుష్యరాగం నాటకంలో ఓ సన్నివేశం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్వీఆర్ క్లబ్ రీడింగ్ రూమ్, కొరిటెపాడు వేదికగా జరుగుతున్న డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకోత్సవాల్లో భాగంగా సోమవారం హెచ్‌వీఆర్ ఎస్ ప్రసాద్ నిర్వహణలో స్వర్గీయ రాఘవ రచించిన, ఎస్‌కే మిశ్రో దర్శకత్వం వహించిన దృశ్యవేదిక, విజయవాడ వారి కనకపుష్యరాగం నాటకం సందేశాత్మకంగా సాగింది. తొలుత జరిగిన సభా కార్యక్రమంలో వైకె నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాసరావు, నాటకోత్సవ కమిటీ సభ్యులు బొప్పన నరసింహారావు, కన్వీనర్ గుమ్మడి శ్రీమన్నారాయణ, కాట్రగడ్డ రామకృష్ణప్రసాదు, పొన్నూరు కళాపరిషత్ అధ్యక్షుడు ఆంజనేయులు నాయుడు, నాయుడు గోపి పాల్గొని వైకె నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కారాన్ని డోగిపర్తి శంకరరావుకు అందించి సత్కరించారు.

రాజ్యాంగ నిర్మాత ఆలోచనలతోనే ప్రగతి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆలోచన విస్పోటనాలే దేశ ప్రగతికి కీలకమయ్యాయని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక గోరంట్ల, స్వర్ణభారతినగర్ ప్రాంతాల్లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం రామాంజనేయులు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకునే రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్, మనం ఆచరించేందుకు ఎన్నో మంచి మార్గాల్ని చూపించారని తెలిపారు. అంబేడ్కర్ భావజాలాన్ని పుణికిపుచ్చుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకుసాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నూకవరపు బాలాజీ, స్మితపద్మజ, ఎర్రంశెట్టి పద్మావతి, నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, పంచుమర్తి శేషు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో అంబేడ్కర్ జయంతి వేడుకలు


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ప్రత్తిపాడులో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు. టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, మాజీ జడ్పీటీసీ దక్కుమళ్ల భాగ్యారావు, కుర్రి సుబ్బారెడ్డి, చిన్నం శ్రీకాంత్, బసవబాబు, మందా రవి, మాకినేని జగన్ మోహన్, గోరిజవోలు వెంకటేశ్వరరావు, షేక్ మీర్సా, కాకాని సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసీపీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

వట్టిచెరుకూరు మండలంలో..


అనంతవరప్పాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు, సర్పంచ్

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో స్థానిక కూటమి నాయకులు, ఎస్సీలు సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని గారపాడు, అనంతవరప్పాడు గ్రామాల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివరామకృష్ణారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు వేల్పూరి రమేష్, ఉపాధ్యక్షుడు సుబ్బారావు, బూత్ కమిటీ అధ్యక్షుడు వీరభద్రాచారి, అనంతవరప్పాడు సర్పంచ్ వెంకటరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గొప్ప సంఘసంస్కర్త


యనమదలలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జనసేన పార్టీ నేత కొర్రపాటి నాగేశ్వరరావు తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప సంఘ సంస్కర్త అని ప్రత్తి పాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ప్రత్తిపాడు మండలం యనమదలలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొర్రపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ అంటే ఒక వ్యక్తి కాదు ఒక శక్తి అని, ఆయన తన జీవితాంతం అంటరానితనం, కుల వివక్ష వంటి సాంఘిక దురాచారాలపై పోరాడారన్నారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే నేడు మనం సమానత్వం, సామాజిక న్యాయం గురించి మాట్లాడుకో గలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు నాగినేని సునీల్ కుమార్, యనమదల నుంచి ఎమ్మెల శరత్, మోహన్‌రావు, జొన్నలగడ్డ రాజు, జొన్నలగడ్డ రామస్వామి, చెంచు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

నడింపాలెంలో గ్రావెల్ రోడ్డు పనులకు శ్రీకారం


గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మండలపరిధిలోని నడింపాలెంలో గ్రావెల్ రోడ్డుకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీకారం చుట్టారు. పంచాయతీ నిధులతో బ్రహ్మంగారి గుడి నుంచి పోలేరమ్మ గుడి వరకు అలాగే, రైస్ మిల్లు వరకు రోడ్డు వేయుటకు స్థానిక నాయకులు పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పాలెపు కుమారితో పాటు గ్రామ నాయకులు కొబ్బరి కాయలు కొట్టి పనులను ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో మారుమూల రోడ్లను సైతం వేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాయప్ప, సుబ్బారావు, బైనబోయిన శివయ్య, మందా రవి, పంచాయతీ సెక్రటరీ మూర్తి, హరీష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్బారావు

దుగ్గిరాల, ఏప్రిల్ 14: పిల్లలకు, గర్భిణులకు అందించే పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక అంగన్‌వాడీకేంద్రంలో సోమవారం నిర్వహించారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా దుగ్గిరాల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ వంకదార సుబ్బారావు బాలింతలు, గర్భిణులు ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలో వివరించారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు


తెనాలిలోని టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు


తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు


తెనాలి: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఏసీపీ వాణి తదితరులు


కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ పద్మావతి, అధికారులు


చేబ్రోలు టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు


కొల్లిపరలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు


మాట్లాడుతున్న సమాచార హక్కు కమిషనర్ జొనాథన్


పొన్నూరు టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు


తెనాలి బార్ అసోసియేషన్‌లో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు


రైల్వేస్టేషన్ రోడ్డులో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ శ్రేణులు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

తెనాలి రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని తెనాలి పట్టణ, మండల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. తెనాలి నియోజవర్గ టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి కంచర్ల ఏడుకొండలు పార్టీ శ్రేణులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్‌కుమార్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అత్తోట శరత్, నలుకుర్తి రమేష్, పినపాటి రవీంద్ర, బండికళ్ల ప్రసాద్, మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, డేవిడ్, గిరి, రాజేంద్రప్రసాద్, బీవీచౌదరి, శివ కేశవులు, జక్రయ్య, రామునాయక్, నాగభూషణం, దీపక్, పినపాటి సుధీర్, కుదరవల్లి శ్రీనివాస్ పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

● పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఓఎస్‌డీ ఏసురత్నం పార్టీ శ్రేణులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు బండారు రవికాంత్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జనసేన వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏవో ఆచంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఈ వెంకటేశ్వరరావు, సీనియర్ సహాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పట్టణ పరిసర ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మునిసిపల్ అధికారులతో కలసి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి, ఆర్‌వో రాంప్రసాద్, టీపీవో సాంబశివరావు, మునిసిపల్ కౌన్సిలర్లు, మునిసిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● తెనాలి: స్థానిక గంగానమ్మపేట బస్టాండ్ సెంటర్‌లోని జాషువా విగ్రహం వద్ద గుర్రం జాషువా విజ్ఞాన సమితి, తెనాలి బీజేఆర్ కమిటీ, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహిచారు. కార్యక్రమంలో గుర్రం జాషువా విజ్ఞాన సమితి జనరల్ సెక్రటరీ పి.రవి, బీజేఆర్ కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్, ట్రెజరర్ ఎన్ సద్గుణ, సెక్రటరీ ఎస్ కమలాకర్, అత్తోట శరత్, నలుకుర్తి రమేష్, కొండమూది రమేష్, ఇందుపల్లి రాజారామ్, వి రత్నం తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత దేశానికి దేశానికి అత్యుత్తమ రాజ్యాంగం అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజలందరివాడని డాక్టర్ చందు సాంబశివుడు చెప్పారు. మారీసుపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కర్లపూడి బుల్లియ్య, ద్వారకా శీను, పూర్ణ చంద్రరావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సంజన సింహ, రెవెన్యూ అధికారులు అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.రవీంద్రనాథ్ మాట్లాడుతూ, బడుగు బలహీనవర్గాల జీవితాల్లో వెలుగు నింపారని చెప్పారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని అంబేడ్కర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో గుజ్జర్లమూడి కృపాచారి, దోమ సందీప్, బెన్‌హర్‌బాబు, ప్రభుదాసు, రమేష్, రాంబాబు, అబ్రహాంలింకన్ తదితరులు పాల్గొన్నారు. బీజేఆర్ కమిటీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లింగారావు సెంటర్‌లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మధుబాబు, శరత్, సద్గుణ, సురేష్, కమలాకర్ పాల్గొన్నారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. జోసేష్, బాబుప్రసాద్, హుస్సేన్‌వలి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, అధికారులు, కొల్లిపర మెయిన్‌రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ పిల్లి రాధిక, దళిత సంఘాల నాయకులు, సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి ప్రసంగించారు. మండలంలోని మున్నంగి, తూములూరు, దావులూరు, అత్తోట, అన్నవరం గౌడపాలెం, దంతలూరు తదితర గ్రామాల్లో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో విజయలక్ష్మి, పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, సీపీఎం మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్, నాయకులు మంద్రు రాజు, కంచర్ల అమృతరాజు, బేతాళ భూషణం తదితరులు పాల్గొన్నారు.

● పెదకాకాని: పెదకాకాని సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి జనసేన పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు మండలనేని శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ షైలా. శ్రీనివాసరావు (బుజ్జి), మండల వైస్ ప్రెసిడెంట్ వరికుంట ఏసయ్య, జనసేన పార్టీ నాయకులు కోన హరిప్రసాద్, షేక్ జాకీర్, తోకల మురళి, తడవర్తి అప్పారావు, గుమ్మల శివ నారాయణ, గోపి, మధు, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

● పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు నివాళులు అర్పించారు. యువజన నగర్, వెంగళరావు నగర్, పాతూరు వాటర్ ట్యాంక్ దగ్గర ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, అనంతరం కేక్, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మండలంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, పార్టీ అనుబంధ కమిటీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● తెనాలి క్రైం: తెనాలి బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు హరిదాసు గౌరీశంకర్, సీనియర్ న్యాయవాదులు అన్నం పిన్నారావు, పెరికల డానియేల్, దాసరి శ్రీధర్, మామిడాల శ్రీనివాసరావు, గాజులవర్తి ప్రభాకర్, కొమ్ము అబ్రహాంలింకన్, గోన పుణ్యవతి, పిల్లి సుధాకర్ తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

● చినరావూరులో అంబేడ్కర్ యూనివర్సల్ యూత్ ఆధ్వర్యంలో, న్యాయవాది పిల్లి ప్రేమ్‌రాజ్ ఆధ్వర్యంలో, వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కుర్రా సుజాత, పిల్లి వీరయ్య, కుర్రా శ్రీను తదితరులు అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

● పొన్నూరు టౌన్: దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని సమాచార హక్కు కమిషనర్ జోనాథన్ అన్నారు. పొన్నూరు పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో సోమవారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 135వ జయంతిని జై భీమ్ సమూహం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సమాచార హక్కు కమీషనర్ జోనాథన్ మాట్లాడుతూ అంబేడ్కర్ త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో జై భీమ్ సమూహం నిర్వాహకుడు ఎద్దు శ్యామ్యూల్‌రాజ్ పాల్గొన్నారు. మానవహక్కుల వేదిక కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రాజారావు, మానవహక్కుల వేదిక జిల్లా కన్వీనర్ రాయల్, ప్రజా సంఘాల నాయకులు అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి సీపీఐ కార్యాలయంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధాల నాయకులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం, మునిసిపల్ కార్యాలయం, తదితర ప్రభుత్వ కార్యాలయాలలో భారతీయ జనతా పార్టీ, జనసేన ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే చేబ్రోలు మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

తనిఖీలు మూన్నాళ్ళ ముచ్చటే!

● ప్లాస్టిక్ సంచుల వినియోగం షరా మామూలే

● కాలుష్య కారకాలపై అధికారుల నిర్లక్ష్యం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై తనిఖీలు మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలాయి. ప్లాస్టిక్ సంచుల వినియోగం, విక్రయం షరా మామూలుగానే ఉంది. కాలుష్య కారకాలను అధికారుల నిర్లక్ష్యంతో అరికట్టలేని పరిస్థితి. నానాటికి పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం పట్టణాల్లో నియంత్రణకు, నివారణకు ఆదేశాలు జారీ చేసింది. 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉండే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను విక్రయించడం, వినియోగించడం నిషేధించింది. ఈ ఉత్తర్వులు మునిసిపల్ అధికారులకు అప్పుడప్పుడు మాత్రమే గుర్తుకు వస్తుంటాయి. గుర్తుకు వచ్చినప్పుడు మాత్రమే దాడులు చేసి జరిమానాలు విధిస్తుంటారు. ఆ కొద్ది రోజులు హోటళ్లు, దుకాణాలు, తోపుడు బండ్లు తదితర వ్యాపార సంస్థలు తమ వద్ద ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వినియోగం లేదని చెబుతున్నారు. పట్టణంలో నిత్యం వందలాది దుకాణాలు, తోపుడు బండ్లు, పూలు, పాలు, కూరగాయలు, వేడివేడి కూరలు తీసుకువెళ్లేందుకు విచ్చలవిడిగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు వినియోగిస్తున్నారు. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా వాడి పడవేసిన ప్లాస్టిక్ సంచులు దర్శనమిస్తున్నాయి. మురుగు కాల్వల్లో ఎప్పుడు పూడిక తీసినా తట్టల కొద్దీ ప్లాస్టిక్ బాటిల్స్ సంచులు బయట పడుతున్నాయి. డంపింగ్ యార్డును పరిశీలిస్తే అక్కడవేసే వ్యర్థాల్లో సింహభాగం ఇవే కనపడతాయి. అయినా కూడా అధికారులకు ప్లాస్టిక్ నియంత్రణపై పట్టు ఉండటం లేదు. ప్లాస్టిక్ సంచుల కారణంగా పర్యావరణ కాలుష్యం తలెత్తుతోందని, పర్యావరణవేత్తలు గగ్గోలు పెడుతున్నా నిషేధ లక్ష్యాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి.


ప్లాస్టిక్ సంచుల్లో తీసుకువెళుతున్న సరుకులు

వేడి వేడి ఆహారం.. ప్లాస్టిక్‌లోనే

పట్టణంలో హోటల్స్, టిఫిన్ బండ్లు, కూరలు, సాంబారు వంటివి విక్రయించే దుకాణాల్లో ప్లాస్టిక్ విచ్చలవిడిగా వాడుతున్నారు. టిఫిన్ ప్లేట్లలో వాడే ఆకులకు బదులు ప్లాస్టిక్ పేపర్ వేస్తున్నారు. వేడివేడి ఆహారం ప్లాస్టిక్ పేపర్‌పై పెట్టుకుని తింటున్నారు. వేడి వేడి టిఫిన్లను పార్శిల్ చేసేందుకు కూడా ఆకులకు బదులు ప్లాస్టిక్ పేపర్‌నే వాడుతున్నారు. భోజనానికి కూరలు విక్రయించే దుకాణాలు కూడా వేడివేడి కూరలు, సాంబారు, రసం వంటి వాటిని కూడా ప్లాస్టిక్ కవర్లలో కట్టి ఇస్తున్నారు. వేడి వేడి ఆహారం ప్లాస్టిక్‌లో తీసుకుంటే రోగాల బారిన పడతామని స్పృహ కూడా తగ్గిపోతోంది. ఇక టీ దుకాణాలలో అయితే అక్కడక్కడ గాజు గ్లాసులు వినియోగిస్తున్నా అధిక భాగం ప్లాస్టిక్ కప్పులనే వాడుతున్నారు. టీ గ్లాసుల్లో కూడా ఉండే ప్లాస్టిక్ పొర వేడి వేడి టీ కారణంగా కరిగి టీతో పాటు శరీరంలోకి ప్రవేశించడంతో అనారోగ్యం బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మునిసిపల్ అధికారులు ప్రతివారం దాడులు చేసి జరిమానాలు విధిస్తే తప్ప ప్లాస్టిక్ వినియోగం, విక్రయం అరికట్టలేరని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

ఆకతాయికి దేహశుద్ధి

తెనాలిరూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్రిపాలెం రోడ్డులో మద్యంతాగిన యువకుడు వీరంగం సృష్టించగా స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుర్రిపాలెం నుంచి తెనాలి వచ్చే రోడ్డులో ఓ యువకుడు పూటుగా మద్యం సేవించి యువతిని వేధించాడు. చుట్టుపక్కల జనం అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వెనిగండ్లలో 7 కేజీల వెండి వస్తువుల అపహరణ

పెదకాకాని, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వెనిగండ్లలో చోరీ జరిగినట్లు సోమవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వెనిగండ్లకు చెందిన దోబగుంట రామకృష్ణ కుటుంబ సమేతంగా నాలుగు రోజులు క్రితం హైదరాబాద్ వెళ్లారు. అక్కడినుంచి సోమవారం వచ్చి చూసి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తలుపులు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి 7 కేజీల వెండి వస్తువులు, 50వేల రూపాయలు నగదు అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల పేర్కొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

తెనాలి క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెనాలి అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి కె.కోటిరెడ్డి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం కోటిరెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాద సమయంలో ఎంతో మంది సిబ్బంది ప్రమాద నష్టాన్ని తగ్గించి, ప్రమాదంలో చిక్కుకున్న వారి ప్రాణాలు కాపాడారన్నారు. ఈ సందర్భగా వివిధ అగ్నిమాపక పరికరాల ప్రదర్శనతో పాటు ప్రధానంగా ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు, వంట గదిలో జరిగే గ్యాస్ లీక్ అగ్ని ప్రమాదాలు, ఆసుపత్రులలో పెద్దపెద్ద హోటల్స్‌లో, పారిశ్రామిక ప్రాంతాలలో జరిగే ప్రమాదాలు వాటి నివారణపై చేపట్టవలసిన ముందుజాగ్రత్త గురించి గోడ పత్రికలను ఆవిష్కరించారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫై ర్ ఆఫీసర్ ప్రసాదరావు అన్నారు. సోమవారం పొన్నూ రు పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భం గా అగ్ని ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన అ గ్నిమాపక శాఖ సిబ్బందికి నివాళులు అర్పించారు. అ నంతరం అగ్నిప్రమాదాలపై ముద్రించిన కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ఎల్‌పీజీ సిలెండర్ల వినియోగం, పంట పొలాల్లో పంటవ్యర్థాలు తగలబెట్టడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మంటలను అదుపుచేసే పద్ధతులు క్షతగాత్రులను సంఘటన స్థలం నుంచి తరలించే విధానాలను సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది వాసవిక్లబ్ నిర్వాహకులుపాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


శిడిమాను మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

వల్లభాపురంలో ఘనంగా శిడిమాను మహోత్సవం

కొల్లిపర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లభాపురంలో పేరంటాళ్లమ్మ తిరునాళ్ల మహోత్సవాన్ని మూడురోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని శిడిమాను మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శిడిమాను మహోత్సవాన్ని చూడటానికి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పేరంటాళ్లమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా భక్తులకు ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ కోటేశ్వరరావు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

అభివృద్ధిపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

● కొండమూది టీడీపీ నాయకుల విజ్ఞప్తి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కొండమూది గ్రామ అభివృద్ధిపై అసత్య ప్రచారాలు మానుకోవాలని గ్రామ టీడీపీ నాయకులు సోమవారం విజ్ఞప్తి చేశారు. కొండమూది గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నాటి పాలకులు చెరువు అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన చెరువులో పూడిక పేరుకుపోయి కట్టలు బలహీనపడి చెరువు నిల్వ లేక నిరుపయోగంగా మారిందన్నారు. ప్రస్తుతం చెరువు మరమ్మతు పనులు నిర్వహించి చెరువులో నీటినిల్వ చేసేందుకు చెరువు కట్టలను బలపరిచే పనులు జరుగుతున్నాయన్నారు. కానీ కొందరు మట్టి తరలించుకుపోయి అమ్ముకుంటున్నట్లు అసత్య ప్రచారాలు చేయడం సహించబోమన్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో విద్వేషాలు రగిలించడానికి గడ్డివాములు తగలపెట్టిన సంఘటనలు గుర్తుచేశారు. చెరువు అభివృద్ధి చేసే వరకు గ్రామస్థుల అవసరాలు తీర్చేలా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రతి రోజు ట్యాంకర్‌ల ద్వారా నీటి సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని టీడీపీ నాయకులు కోరారు.

నేలవాలిన ధ్వజస్తంభాన్ని పరిశీలించిన టీడీపీ నాయకులు

పొన్నూరు టౌన్, చేబ్రోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలుల ప్రభావంతో నేలవాలిన ధ్వజ స్తంభాన్ని గ్రామస్థుల సహకారంతో పునః ప్రతిష్ఠిస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు తెలిపారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాలతో సోమవారం మండల పరిధిలోని శలపాడులో టీడీపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఈదురు గాలుల ప్రభావంతో నేలవాలిన చంద్రశేఖరస్వామి ఆలయ ధ్వజస్తంభాన్ని టీడీపీ నాయకులు పరిశీలించి గ్రామస్థులతో చర్చించారు. త్వరలోనే దేవదాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ధ్వజస్తంభ పునః ప్రతిష్టకు కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. పద్మశాలీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు 989 మార్కులు సాధించిన జొన్నాదుల బాలవర్షిణిని సోమవారం ప్రోత్సాహక బహుమతి, జ్ఞాపిక అందించి అభినందించారు. బంగారం పనిచేసి జీవించే కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమని సంఘ అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ చెప్పారు. జి.సుబ్బారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వరప్రసాద్ పాల్గొన్నారు.